www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 గురువారం

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 19, డిసెంబర్ 2024

సంపుటి: 6 సంచిక: 201, పేజీలు: 12, వెల: రూ.5/-




## రూ.224 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ వినతి
- సానుకూలంగా స్పందించిన గడ్కరీ
- మానేరుపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరిన బండి

న్యూఢిల్లీ, వెలుతురు, డిసెంబర్ 18:
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాలకు రవాణా సదుపాయాలను మెరుగుపర్చేందుకు రూ.224 కోట్ల మిగతా..3లో

# అదాని అవినీతికి మోడీ ముసుగు

- అవినీతిలో కూరుకుపోయిన భారత వ్యాపార వ్యవస్థలు
- లంచాలు ఇవ్వనిదే వ్యాపారాలు చేయని పరిస్థితి
- అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారు
- ప్రపంచ దేశాల ముందు భారత్ పరువు తాకట్టు
- అదానిపై అవినీతి చర్చకు, జేపీసీకి సిద్ధంగా లేని భాజాపా
- అదానిపై జేపీసీ వేస్తే జైలుకే...
- మణిపూర్ అల్లర్లు, అదానీ వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణలు
- కేంద్రం వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నేతల 'ఛలో రాజ్‌భవన్'
- జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నాకు సిద్ధం
- మోదీ కేసీఆర్ వేర్వేరు కాదు... ఇద్దరూ నాణేనికి బొమ్మా బొరుసు
- రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగిన ప్రభుత్వ సీఎం, మంత్రులు, నాయకులు



హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు):
భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకు పోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. ఆదానీని ప్రధాని వెనకేసుకుని వచ్చినా, అమెరికా మాత్రం వదలదని హెచ్చరించారు. ఆదానీపై చర్యలకు ఢిల్లీలో కూడా ధర్నాకు వెనకాడబోమని సిఎం రేవంత్ హెచ్చరించారు. మణిపూర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల మిగతా..2లో




## ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం..

- మాజీ మంత్రి కేటీఆర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 18:
రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇచ్చిందని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటోడ్రైవర్లు. ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని వాయిదా తీర్మానం ఇచ్చినట్లుగా తెలిపారు,కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఏడాదికి 12,000 రూపాయల ఆర్థిక సహాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ,మరియు ఇతర ఎమ్మెల్యేలు.ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ అసెంబ్లీలో వాయిదా తీర్మానం కోరడంతో పాటు అసెంబ్లీ సమావేశాల్లోకి ఖాకీ దుస్తులు ధరించి మిగతా..2లో

## ఆటో కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

- అసెంబ్లీలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 18:
బీఆర్ఎస్ పార్టీ ఆటో కార్మికుల పైన మొసలి కన్నీరు కారుస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.ఆటో కార్మికులపై మీకు చిత్తశుద్ధి ఉంటే మీ ప్రభుత్వం ఉన్న 10 సంవత్సరాల్లో వారి సంక్షేమం కోసం తీసుకున్న చర్యలు ఏంటి...? చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు,మెట్రో వస్తే ఇతర వాటిపై ప్రభావం పడిందని మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తే ఆటో ల పై ప్రభావం పడిందని ఆరోపణ తప్పు కాదని మంత్రి అన్నారు.బస్సు ప్రయాణికుల ఇంటికి వెళ్లడం లేదు, గతంలో లాగానే బస్సు స్టాండ్ నుండి పోతుంది.



ప్రజలు ఇంటి దగ్గర నుండి బస్సు స్టాండ్‌కి వెళ్ళడానికి ఆటోలను వాడుతున్నారని మంత్రి తెలిపారు. ఎన్నికలలో ఆటో కార్మికులకు 12 వేలు సంవత్సరానికి ఇస్తామని అన్నాం. మీ నిర్వాకం వల్ల ఆర్థిక సంక్షోభం వల్ల ఈ సంవత్సరం ఇవ్వలేక పోయామ్.. భవిష్యత్‌లో మిగతా..2లో



## అసెంబ్లీలో భూ భారతి

2024 ఆర్వోఆర్ చట్టం

- ధరణి స్థానంలో భూ భారతి
- ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు
- ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం
- ధరణి సమస్యలకు చెక్ పెట్టే విధంగా మార్పులు
- అన్ని వర్గాలతో చర్చలు.. సలహాలతో కొత్త చట్టం
- అసెంబ్లీలో భూ భారతి బిల్లు ప్రవేశపెట్టిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు,హైదరాబాద్ బ్యూరో , డిసెంబర్ 18:
తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ –భూభారతి చట్టాన్ని రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బుధవారం శాసనసభలో మంత్రి భూభారతి బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అద్భుతచట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి మిగతా..3లో

## ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

- అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు):
రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా దిల్‌రాజు బుధవారం ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్టీకి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో మిగతా..2లో



## సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సేవలు అందిస్తాం



- మరో ఉచిత హామీకి ఆప్ హామీ
- ఎన్నికల ముందు ఆప్ అధినేత కేజ్రీవాల్ ప్రకటన

న్యూఢిల్లీ,డిసెంబర్18(వెలుతురు):
ఇప్పటికే అనేక ఉచిత హామీలతో అదరగొడుతున్న ఆప్ అధినేత కేజ్రీవాల్ మరో హామీ గుప్పించారు. వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఆప్ కీలక హామీ ప్రకటించింది. ఢిల్లీలోని సీనియర్ సిటిజన్లు అందరికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చింది. మరోసారి ఆప్ అధికారంలోకి వస్తే 60 ఏళ్లు దాటిన వృద్ధులందరికీ ఉచిత వైద్యం అందించేలా 'సంజీవని యోజన' అమలు చేస్తామని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. మిగతా..2లో

## చర్చ పెట్టండి.. నేను రెడీ..

దమ్ముంటే ఫార్ములా-ఈ రేసింగ్‌పై శాసనసభలో కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 18 (వెలుతురు):
దమ్ముంటే ఫార్ములా ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా మిగతా..2లో



## అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

- అమిత్‌షాపై కాంగ్రెస్ విమర్శలు దారుణం
- ఎక్స్ వేదికగా మండిపడ్డ ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,డిసెంబర్18(వెలుతురు):
డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవమానించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న క్రమంలో... తాజాగా దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు షెడ్యూల్ కులాలు, తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసిందో ప్రజలంతా చూశారని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'కొన్నేళ్ల పాటు మిగతా..2లో



## గరిష్ట స్థాయికి వాణిజ్య లోటు

- మోడీ విధానాలతో తిరోగమన దిశ
- ఎక్స్ వేదికగా మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,డిసెంబర్18(వెలుతురు):
వాణిజ్య లోటు ఆల్‌టైం గరిష్ఠ స్థాయికి చేరడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయమై బుధవారం లోక్‌సభలో మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బీజేపీ ప్రభుత్వం చట్టపరంగా జరిగే వ్యాపారాల పట్ల పారదర్శకంగా వ్యవహరించట్లేదని మండిపడ్డారు. 'ప్లే-ఫెయిర్'కంటే మిగతా..2లో




## 100 ఎకరాలలో హైకోర్టు

- హై కోర్టు నిర్మాణానికి 2,583 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- వంద ఎకరాలలో హై కోర్టు భవన నిర్మాణాలు
- ఈనెల చివరి వారంలో టెండర్ల ప్రక్రియ
- టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసే పనిలో ఆర్ అండ్ బి శాఖ నిమగ్నమ్

రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

(రాపర్తి భాస్కర్ గౌడ్)

వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 18::
రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర శివారు రాజేంద్ర నగర్ లో నూతనంగా నిర్మించనున్న హై కోర్టు నిర్మాణానికి ప్రభుత్వం 2,583 కోట్ల ను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది, అయితే నూతనంగా నిర్మించనున్న హై కోర్టు భవన నిర్మాణానికి ఈనెల చివరి వారంలో టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది, అలాగే వంద ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హై కోర్టు సివిల్ నిర్మాణ పనులకు 1980 కోట్ల రూపాయలను , ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పనులకు మిగతా..2లో



జనరల్‌న్యూస్
గురువారం
19, డిసెంబర్ 2024



## ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం..

మొదటిపేజీ తరువాయి..
సభకు ఆటోను నడుపుకుంటూ వచ్చారు. దీంతో సభలో ఆటో డ్రైవర్లకు మద్దతుగా నినాదాలు చేశారు, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లుకు అండగా ఉంటామని కేటీఆర్ తెలిపారు,ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని వాయిదా తీర్మానంను ఇచ్చినట్లుగా కేటీఆర్ తెలిపారు, ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

మొదటిపేజీ తరువాయి..
ఆటో కార్మికులను ఆదుకునే బాధ్యత మా ప్రభుత్వానికి ఉందని మంత్రి ప్రభాకర్ అన్నారు. ఆటో కార్మికులు వేసుకునే డ్రెస్‌లు వేసుకోవడం నిన్న బేడీలు వేసుకొని వేషాలు వేయడం రాజకీయ డ్రామా అని మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు. అటువంటివి చేయకండి. మీకు ఏమైనా చిత్తశుద్ధి ఉంటే ఏనాడయినా రవాణా శాఖ మంత్రికి ఆటో కార్మికుల సమస్యలపై రీప్రజెంటేషన్ చేసారా అని ప్రశ్నించారు,రాజకీయాల కోసం నిరసనలు చెప్పడం కోసం ప్రజాస్వామికంగా ఆటో కార్మికుల ను తీసుకుని రండి ఆటో కార్మికుల సమస్యల పై చర్చిద్దామని మంత్రి ప్రభాకర్ ప్రతి పక్ష పార్టీ నాయకులకు సూచించారు.

## సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సేవలు అందిస్తాం

మొదటిపేజీ తరువాయి..
'వయో వృద్ధుల సంరక్షణ మా బాధ్యత. మీరెంతో కష్టపడి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకొచ్చారు' అన్నారు. సీనియర్ సిటిజన్లు అనారోగ్యానికి గురైతే వారి చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ఠ పరిమితి ఏమీ ఉండదని కేజ్రీవాల్ తెలిపారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ పక్రియ మొదల వుతుందని.. ఆప్ కార్యకర్తలే ఇళ్లకు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. వారు ఇచ్చే కార్డును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే.. ఈ ఉచిత చికిత్స విధానాన్ని అమలు చేస్తామన్నారు. మరోవైపు, దిల్లీ ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ వారంలోనే సమావేశం నిర్వహించనుంది. ఈ క్రమంలో త్వరలోనే ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆప్ 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆప్ చీఫ్ కేజ్రీవాల్ న్యూదిల్లీ నుంచి పోటీ చేయనున్నారు.. సీఎం ఆతిశీ కల్కాజీ సీటు నుంచి బరిలో నిలవనున్నారు.

## చర్చ పెట్టండి.. నేను రెడీ..

మొదటిపేజీ తరువాయి..
జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ధి చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం జరిగింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది అని కేటీఆర్ మండిపడ్డారు.

## 100 ఎకరాలలో హైకోర్టు

మొదటిపేజీ తరువాయి..
603 కోట్లు ఖర్చు చేయనున్నారు, హైకోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది, దీంతో ఆర్ అండ్ బి అధికారులు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించీ ఈ నెల చివరి వారంలో టెండర్లు పిలవాలని అధికారులు భావిస్తున్నారు, అయితే రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటున్న హై కోర్టు నిర్మాణంపై ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలుస్తోంది. ఇది ఇలాఉండగా ప్రభుత్వం భారీ మొత్తంతో హైకోర్టు నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బార్ అసోసియేషన్ నాయకులు,న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## ఎఫ్‌డిసి చైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

మొదటిపేజీ తరువాయి..
ఉపయోగపడతాయాని ఈ సందర్బంగామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణాలో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.

## అంబేడ్కర్‌ను అవమానించిందే కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి..
కాంగ్రెస్ సాగించిన అరాచకాలు, ముఖ్యంగా అంబేద్కర్‌ను అవమానించిన తీరును ఇప్పుడు చెప్పే అబద్దాలతో వారు దాచలేరు. అలా అనుకుంటే వారు పెద్ద పొరబాటు చేసినట్లే. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరిచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఒక పార్టీ చేసిన ప్రయత్నాలను దేశ ప్రజలంతా చూశారు. మనం ఇలా ఉండటానికి అంబేద్కరే కారణం. గత దశాబ్దకాలంగా ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటి ప్రధాన కార్యక్రమాలు ప్రతిఒక్కరికీ ఉపయోగపడ్డాయి. అంబేద్కర్‌తో అనుబంధం ఉన్న ఐదు ప్రసిద్ధ ప్రదేశాలైన పంచతీర్థాన్ని అభివృద్ధి చేసేందుకు మా ప్రభుత్వమే కృషి చేసింది. దశాబ్దాలుగా చైత్య భూమికి సంబంధించిన పెండింగ్ లో ఉన్న భూ సమస్యను మా ప్రభుత్వమే పరిష్కరించింది. నేను అక్కడ ప్రార్థనకు వెళ్లాను. అంబేద్కర్ తన చివరి ఏడాదిలో గడిపిన దిల్లీలోని 26 అలీపూర్ రోడ్డును మేము అభివృద్ధి చేశాం. లండన్ లో ఆయన నివసించిన ఇంటిని మా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఆయన్ను సంపూర్ణంగా గౌరవిస్తుంది మేమే. పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా మాట్లాడి కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు. ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వారు సైతం ఉలిక్కిపడటంతో పాటు ఆశ్చర్యపోయారు. అందుకే ఇప్పుడు వారు నాటకాలాడుతున్నారు. కానీ, ప్రజలకు నిజం తెలుసు' అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటులో షా మాట్లాడిన వీడియోను ఆయన పంచుకున్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా అంబేడ్కర్ ను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. షా దళితులను అవమానించారంటూ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు ఆరోపించారు. బుధవారం పార్లమెంటు ఆవరణలో అంబేడ్కర్ ఫొటో పట్టుకొని నిరసన తెలిపారు. ఆయన హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

## జేపీసీలో కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ

- జేపీసీ సభ్యుల పేర్లు ఖరారు చేసిన పార్టీలు
- పరిశీలనలో మరికొందరి పేర్లు
- బీజేపీ నుంచి ప్యానెల్ సభ్యుల నియామకం ఖరారు
- ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, నిశికాంత్ దుబే పేర్లు ప్రతిపాదన
- తృణమూల్ కాంగ్రెస్ నుండి జేపీసీకి ఇద్దరి ప్రతిపాదన
- బిల్లుపై అధ్యయనానికి కమిటీలో 31మందితో కమిటీ

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18((వెలుతురు):**
జమిలి ఎన్నికల బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపేందుకు ప్రభుత్వం సిద్ధమైన వేళ జేపీసీలో తమ తరఫు నుంచి ప్రాతినిధ్యం వహించే సభ్యుల పేర్లను పార్టీలు ఖరారు చేస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ నాయకు రాలు ప్రియాంక గాంధీ పేరును ప్రతిపాదించినట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రియాంకతో పాటు మనీష్ తివారీ, సుఖ్‌దేవ్ భగత్, రణదీప్ సూర్జేవాలా పేర్లను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినట్లు సమాచారం. బీజేపీ నుంచి ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, నిశికాంత్ దుబే పేర్లను ప్యానెల్ సభ్యులుగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ కూడా జేపీసీకి ఇద్దరి పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. లోక్‌సభ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ సభ్యుడు సాకేత్ గోఖలే పేర్లను జేపీసీకి పంపనున్నట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. శివసేనకు చెంది శ్రీకాంత్ శిందే, జేడీయూ నుంచి సంజయ్ ఝా, డీఎంకే తరఫున టీఎం సెల్వగణపతి, పీ విల్సన్ ఉన్నారు. బిల్లుపై అధ్యయనం చేయడానికి కమిటీలో 31మంది ఎంపీలు ఉంటారని, అందులో లోక్?సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10మంది ఉండనున్నట్లు సమాచారం. విపక్షాల తీవ్ర వ్యతిరేకత మధ్య లోక్‌సభ, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే రెండు బిల్లులను కేంద్రం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. వాటిని జేపీసీకి పంపాలంటే ముందు లోక్‌సభ తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత జేపీసీని స్పీకర్ ఏర్పాటు చేస్తారు. మంగళవారం జమిలి బిల్లును లోక్‌సభ పరిగణనలోకి తీసుకోవడంపై విపక్ష సభ్యులు ఓటింగ్ కోరారు. ఇందుకు అంగీకరించిన స్పీకర్ హైబ్రిడ్ విధానంలో ఓటింగ్ నిర్వహించారు. 360 మంది ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో, మరికొందరు బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేశారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది ఓటు వేశారు. దీనితో జమిలి ఎన్నికల బిల్లులు ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లు అయ్యింది. ఈ బిల్లుపై ఎన్?డీఏ మిత్ర పక్షాలు పూర్తి మద్దతును ప్రకటించాయి. కానీ కాంగ్రెస్ సహా విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. పూర్తి స్థాయిలో చర్చ జరిగేందుకు వీలుగా ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించారు. కాగా బిల్లు ప్రకారం, దేశంలో జమిలి ఎన్నికలు 2034 నుంచి జరిగే అవకాశముంది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టరూపం సంతరించుకున్నాక జరిగే సాధారణ ఎన్నికల అనంతరం ఏర్పడే లోక్‌సభ తొలి సిటింగ్ డేకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అపాయింటెడ్ డేగా పిలిచే ఆ రోజు తర్వాత ఏర్పడిన అన్ని అసెంబ్లీలు కూడా లోక్‌సభ కాలపరిమితితోపాటే ముగుస్తాయి. ఆ తర్వాత నుంచి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలన్నీ ఏకకాలంలో జరుగుతాయి. లోక్‌సభగానీ, అసెంబ్లీగానీ పూర్తికాలం ముగియక ముందే రద్దయితే వాటికి 5 ఏళ్ల కాలంలో మిగిలిన సమయానికే ఎన్నికలు జరుగుతాయని బిల్లు పేర్కొంది. అందువల్ల జమిలి విధానం 2029 సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఆచరణలోకి వస్తుంది. ఉదాహరణకు 2029 మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన అనంతరం ఏర్పడే 19వ లోక్‌సభ మొదటి సిటింగ్ తేదీని రాష్ట్రపతి జూన్ 1గా నిర్ధరిస్తే ఆ తర్వాత ఏర్పడే అసెంబ్లీలన్నీ ఆ లోక్‌సభతోపాటే ముగుస్తాయి. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు ఎలాంటి ఇబ్బంది



ఉండదు. 2004 నుంచి కూడా వాటి ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటే జరుగుతున్నందున 2029, 2034లోనూ అదే విధానం కొనసాగుతుంది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు తదుపరి అసెంబ్లీ ఎన్నిక 2028 నవంబరు- డిసెంబరులో జరిగి 2033 నవంబరు వరకూ మనుగడలో ఉంటాయి. 2029లో ఏర్పడే 19వ లోక్‌సభ కాలపరిమితి 2034 మేలో ముగియనున్నందున 2033లో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు, 2034 లోక్‌సభ ఎన్నికలకు మధ్య ఏర్పడే 6 నెలల వ్యవధికి రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. 2028 మే, జూన్ నెలల్లో జరిగే కర్ణాటక, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ లాంటి రాష్ట్రాల అసెంబ్లీలు 2033 మే, జూన్‌లలో ముగుస్తాయి. 2034తో జరిగే లోక్‌సభ ఎన్నికలతో వీటికి ఏడాది వ్యవధి ఉంటుంది కాబట్టి ఆ ఏడాదికే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా లేదంటే వాటికి రాష్ట్రపతి పాలన అమలు చేస్తారా అన్నది చూడాలి. మిగిలిన రాష్ట్రాల్లోనూ ముందూ వెనుకా ఎన్నికలు ఉండటంతో ఏం చేస్తారన్నది వేచి చూడాలి.

## గరిష్ట స్థాయికి వాణిజ్య లోటు

మొదటిపేజీ తరువాయి..
క్రోనీ వ్యాపారాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థకు నష్టం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీ రంగం బలహీన పడుతోందని, ఇదివరకెన్నడూ లేనివిధంగా కరెన్సీ విలువ క్షీణిస్తోందని అన్నారు. పదేళ్లుగా మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యల కారణంగానే దేశంలో రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు నమోదయ్యిందని ఆందోళన వెలిబుచ్చారు. వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా నమోదయ్యాయని ఒక మీడియా కథనాన్ని ఎక్స్‌లో ట్యాగ్ చేస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ విరుచుకుపడ్డారు. దేశంలో రికార్డు స్థాయిలో వాణిజ్య లోటు, దిగుమతులు నమోదవడంపై సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. మోదీ ప్రభుత్వం దేశం కోసం కాక సన్నిహిత వ్యాపారులకు మేలు చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవడం వల్లే వాణిజ్య లోటు ఆల్‌టైం హైకి చేరిందని విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వం 'ప్లే-ఫెయిర్'వ్యాపారాలను ప్రోత్సహించడానికి బదులుగా క్రోనీ బిజినెస్‌లను ప్రోత్సహిస్తే ఇలా కాక ఇంకెలా జరుగుతుందని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. ఇదే తరహా విధానాలు కొనసాగిస్తే తయారీ రంగం పూర్తిగా దెబ్బతిని కరెన్సీ విలువ బలహీనపడుతుందని మండిపడ్డారు. రికార్డు వాణిజ్య లోటు కారణంగా వడ్డీరేట్లు తారాస్థాయికి చేరుతాయని, వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరగడం చూస్తామని సోషల్‌మీడియా వేదికగా పేర్కొన్నారు. అక్టోబర్‌లో రెండంకెల వృద్ధిని నమోదు చేసిన ఎగుమతుల రంగం నవంబర్ నెలలోకి అడుగుపెట్టేసరికి చతికిలపడింది. పసిడి దిగుమతులు గణనీయంగా పెరగడం వల్లే.. వాణిజ్య లోటు ఆల్‌టైం గరిష్ఠ స్థాయిని తాకిందని వాణిజ్య శాఖ వర్గాలు చెబుతుండగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కేందప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకుండా, చట్ట ప్రకారం జరిగే వ్యాపారాలను పట్టించుకోకుండా, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ అవలంభించే ఇటువంటి చర్యల ఫలితంగా దేశంలో తయారీ రంగం బలహీనపడుతోందని, కరెన్సీ విలువ పడిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రికార్డు స్థాయిలో గరిష్ఠ వాణిజ్య లోటు,అధిక వడ్డీ రేట్లు పెరుగుతాయని తెలిపారు. ఈకారణంగా వస్తువుల వినియోగం తగ్గి ద్రవ్యోల్బణం పెరుగుదల వంటివన్నీ చూస్తామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. దేశంలో వాణిజ్య లోటు, దిగుమతులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయని వస్తున్న వార్తా కథనాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పసిడి దిగుమతులు గత నెలలో రికార్డు గరిష్ఠమైన 14.86 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023 నవంబరులో పసిడి దిగుమతులు 3.44 బిలియన్ డాలర్లతో పోలిస్తే, ఇవి 4 రెట్లు అధికం. విలువ పరంగా చూస్తే ఏడాది వ్యవధిలో 331శాతం పెరగడం గమనార్హం. ఏప్రిల్- నవంబరులో పసిడి దిగుమతులు 49 బిలియన్ డాలర్లకు చేరాయి. 2023లో దిగుమతులు 32.93 బిలియన్ డాలర్లతో పోలిస్తే, ఇవి అధికం. వంట నూనె, ఎరువులు, వెండి అధిక ఇన్‌బౌండ్ షిప్‌మెంట్ల కారణంగా దిగుమతులు సంవత్సరానికి 27శాతం పెరిగి రికార్డు స్థాయిలో 69.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

# అదాని అవినీతికి మోడీ ముసుగు

మొదటిపేజీ తరువాయి..
ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. 75 ఏళ్లు కష్టపడి దేశ ప్రతిష్టను కాంగ్రెస్ పెంచితే.. ప్రధాని మోడీ, ఆయన మిత్రుడు అదానీ కలిసి దేశ పరువు తీశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లస్ రోడ్ నుండి రాజ్ భవన్ వరకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి రాజ్ భవన్ రూట్‌లో బైఠాయించారు.

ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసేందుకు బిలియనీర్ అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయి.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలదీశారు.. కానీ ప్రధాని మోడీ దీనిపై మౌనంగా ఉంటున్నారని అన్నారు. అదానీతో ప్రధాని మోడీకి లాలూచీ ఒప్పందం ఉందని.. అందుకే అదానీ కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాజ్ భవన్ ముట్టడించామని తెలిపారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని.. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే








ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు.. కానీ దేశ ప్రతిష్టను కాపాడుకోవడానికే రోడ్డుపై నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే నిరసన చేపడుతున్నామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే మేం ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని.. ముఖ్యమంత్రి ధర్నా చేస్తారా అని బీఆర్ఎస్ అంటోంది.. నేను ధర్నా చేయను.. మరీ వాళ్లు వచ్చి చేస్తారా అని ప్రశ్నించారు.

అదానీ అంశంపై బీఆర్ఎస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సై అంటే అసెంబ్లీలో ఆదానీ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో ఆయన మిత్రుడు, బిలియనీర్ గౌతమ్ అదానీ దేశ సంపద దోచుకుంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అదానీ దేశ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. అదానీ దేశ ప్రజలను సొమ్మును ఏ విధంగా దోచుకుంటున్నారు.. బ్యాంకులను ఓ విధంగా మోసం చేశారో హిండెన్ బర్గ్, అమెరికా న్యాయవాదులు చెప్పారని గుర్తు చేశారు.

అదానీ ఆర్థిక అవకతవకలపై పార్లమెంట్‌లో చర్చ కోసం కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. కొన్ని నెలలుగా జాతుల మధ్య అల్లర్లతో మణిపూర్ అట్టుడికిపోతున్న మోడీ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఈ క్రమంలోనే అదానీ ఇష్యూ, మణిపూర్ అల్లర్ల విషయంలో ప్రధాని మోడీ మౌనాన్ని నిరసిస్తూ ఏఐసీపీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.




## టీజీ టెట్-2024 పరీక్షల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,డిసెంబర్ 18 (వెలుతురు):**
టీజీ టెట్2024 పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు 20 సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లు అంటే సెషన్ 1 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పేపర్-1 పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలను జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2వ తేదీన ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో సోషల్ స్టడీస్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నారు. జనవరి 5న ఉదయం సెషన్‌లో సోషల్ స్టడీస్(పేపర్ -2), మధ్యాహ్నం సెషన్‌లో మ్యాథమేటిక్స్ అండ్ సైన్స్(పేపర్-2) పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## పెండింగ్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**- ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన ప్రైవేట్ మెడికల్, నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలు**

**వెలుతురు, హైదరాబాద్, డిసెంబర్ 18:** డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్యాలయంలో బుధ వారం పెండింగ్ స్కాలర్షిప్ బకాయిలు విషయమైన చర్చలు జరిగాయి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో రాష్ట్ర



వ్యాప్త ప్రైవేట్ మెడికల్, నర్సింగ్ కళాశాలల యజమాన్యాలు సమావేశమిన్నాయి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ను కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి బకాయి ఉన్న నిధులను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని భట్టి విక్రమార్క వారికి తెలిపారు, అలాగే ఇటీవల రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఇంటర్. డిగ్రీ కళాశాలలకు సంబంధించిన ఫీజ్ రీయింబర్స్ మెంట్ ను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భట్టి విక్రమార్క ను ప్రైవేట్ ఇంటర్. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కలిసిన విషయం తెలిసిందే.

## వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్లుంది

- అదానీకి తోడు నీడగా ఉంటూ కష్టపడుతున్న రేవంత్..
- అదానీకి వ్యతిరేక ర్యాలీ తీయాలనుకుంటున్నాడు
- కొత్త నాటకానికి శ్రీకారం చుట్టిన రేవంత్ రెడ్డి
- భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న సిఎం
- ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదు
- ఏడాదిలో లక్షల కోట్ల అప్పులు చేశారు
- ఆ పైసలు ఎక్కడ ఖర్చు పెట్టారో లెక్కలు చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులు చేస్తోంది
- సీఎం, మంత్రుల వేములవాడ పర్యటనలో అడ్డగోలు ఖర్చులు
- భోజనాల ఖర్చు ఒక్కో ప్లేటుకు రూ. 32 వేలు పెట్టింది
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, డిసెంబర్ 18(వెలుతురు):**
సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఈసారి ముఖ్యమంత్రి పాదయాత్ర విషయమై సెటైర్లు వేశారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ ఆసక్తికర పోస్ట్ చేశారు. "వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు బయలుదేరినట్టు.. అదానీకి అన్ని రకాలుగా తోడు నీడగా




ఉంటూ ఆయన కోసం కష్టపడుతున్న రేవంత్.. ఇవాళ అదానీకి వ్యతిరేక ర్యాలీ తీయాలనుకుంటున్నాడు. జైపూర్ లో సరిగ్గా అతిథి మర్యాదలు జరగలేదనో.. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ దక్కలేదనో.. మొత్తానికి కొత్త నాటకానికి శ్రీకారం చుట్టాడు మన చిట్టినాయుడు. భాయ్, భాయ్ అని వందల, వేల కోట్లు పంచుకున్న ముఖ్యమంత్రి.. అదానీ వ్యతిరేక ర్యాలీ తీస్తున్నాడంట. నవ్వి పోదురు నాకేటి సిగ్గు అని%ఔ%రేవంత్ ని చూసే రాసుంటారూ. మిమ్మల్ని ఎన్నుకున్నంత మాత్రం ప్రజలు మరీ అంత తెలివి తక్కువ వాళ్ళనుకుంటున్నావా? లేక మళ్లీ మళ్లీ మోసం చెయ్యచ్చులే అనుకుంటున్నావా? దొంగే దొంగ అనడం నేడు కామన్ అయిపోయింది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని నిప్పులు చెరిగారు. కానీ లక్షల కోట్ల అప్పులు చేశారని, ఆ పైసలు ఎక్కడ ఖర్చు పెట్టారని నిలదీశారు. అంతేకాకుండా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా.. సీఎం, మంత్రుల భోజనాల ఖర్చు నిమిత్తం.. ఒక్కో ప్లేటుకు రూ. 32 వేలు ఖర్చు చేసినట్లు వచ్చిన వార్తా కథనాలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులను కేటీఆర్ ఎండగట్టారు. ఒక్క ఇటుక పెట్టలేదు, గుప్పెడు మన్ను తియ్యలేదు.. కానీ లక్ష ఇరవై మూడు వేల కోట్ల అప్పు ఎందుకు చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. అప్పు సరే కానీ భోజనాలు బాగా అయ్యాయా? అని వేములవాడ పర్యటన సందర్భంగా రేవంత్ సర్కార్ చేసిన ఖర్చును కూడా కేటీఆర్ ప్రస్తావించారు. అందరూ కడుపునిండా తిన్నారా..? తిన్నాక పాన్ వేసుకున్నారా? రూ. 32,000 ప్లేట్ భోజనం అంటే అరగాలి కదా? అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

### TG EDCET ప్రవేశానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లను నిర్వహించేందుకు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి

## ప్రొఫెసర్‌ను నియమించాలి

**ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ**



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 18:**
తెలంగాణ ఉన్నత విద్యా మండలి TGCHE చైర్మన్ గారు, TGCETS-2025 యొక్క కన్వీనర్‌లుగా వ్యవహరించడానికి సంబంధిత విశ్వవిద్యాలయాల వైస్-ఛాన్సలర్‌లతో సంప్రదించి, వివిధ UG మరియు PG ప్రొఫెషనల్ కోర్సులలో ప్రవేశానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లను (CETs) నిర్వహించేందుకు అధికారులు/ప్రొఫెసర్‌లను నియమించారు. TG EDCET ప్రవేశానికి కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లను (CETs) నిర్వహించేందుకు గాను ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి, ఫిజిక్స్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ నియమించడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత ముఖ్యమైన అంశాన్ని డిపార్ట్మెంట్ తో సంబంధం లేకుండా ఏ విధంగా కేటాయిస్తారని ప్రశ్నించారు.పదవి విరమణ పొందిన వారి సేవలను ఉపయోగించుకోవచ్చు ఎంతోమంది సీనియర్ ప్రొఫెసర్స్ ఉన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ లో కూడా ఎంతోమంది సీనియర్ ప్రొఫెసర్స్ ఉన్నారు. ఈ విధంగా మీరు నిర్ణయం తీసుకున్నప్పుడు లా సెట్ కన్వీనర్ కి ఎందుకు ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రొఫెసర్ ని నియమించలేదు.పంచడానికి ఇది పదవి కాదు సంబంధిత విషయ పరిజ్ఞానంతో కూడిన అకాడమిక్ పొజిషన్ కాన్ఫిడెన్షియల్ వర్క్ వుంటుంది. విషయ పరిజ్ఞానం లేని ఫిజిక్స్ ప్రొఫెసర్ ప్రశ్నపత్రాల నాణ్యతను ఏ విధంగా అంచనా వేయగలడు.ఇప్పటికే గ్రూప్ 1 మరియు తదితర ఎంట్రన్స్ లలో జరిగిన అవకతవకల వల్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులలో ఉన్నారు.

ఇంత ముఖ్యమైన అంశాన్ని నవ్వులాటగా తీసుకోవడం సరికాదు. వెంటనే నిర్ణయాన్ని సమీక్షించుకొని విద్యారంగంలోనే ఉన్నవారికి ఇవ్వాలి. ఇలాంటి విచిత్రమైన నిర్ణయం కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురైతే ప్రభుత్వం బాధ్యత నిర్వహించవలసి ఉంటుంది. MED ,BEDలు ఉన్నాయని , గతంలో ఆ డిపార్ట్మెంట్ కు ఇన్చార్జిగా పని చేశారనే సాకుతో వీసీలు ఇలా ఇతర డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ల పేర్లలను రిఫర్ చేయడం దాని గురించి ఉన్నత విద్యా మండలి ఆమోదించడం అనేది విద్యార్థులకు నష్టం కలిగించే విధంగా ఉంది. విద్యావిభాగంలో MED, BED వున్నవారు సీనియర్ ప్రొఫెసర్స్ చాలా మంది వున్నారు అతడికే ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది. గతంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో రెండుసార్లు నిర్వహించడం జరిగింది అక్కడ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లేదు ప్రైవేట్ కాలేజీలు ఉండడంతో ఉస్మానియా యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్స్‌ని తీసుకొని నిర్వహించడం జరిగింది.

ఇప్పుడు ఎందుకు ఉస్మానియాని నిర్లక్ష్యం చేస్తున్నారు. పైరవీల తో పదవులు పొందిన అధికారులు తమ అనుచరులకు అర్హత లేకున్నా పదవులు అంట కట్టడం సరైనది కాదు. అదేవిధంగా TG PECET విషయంలో కూడా ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్‌ను కన్వీనర్‌గా నియమించాలి కానీ JNTUలో ఉన్న ఫిజికల్ డైరెక్టర్‌ను PECET కు ఏ విధంగా కన్వీనర్‌గా నియ మిస్తారు. ఫిజికల్ డైరెక్టర్ ఆటలు ఆడిపిస్తాడు కానీ పాటలు చెప్పడు, పరిశోధనలు చేయడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అనేది బోధనకు సంబంధించింది ఆటలాడడానికి సంబంధించిన మాత్రమే కాదు. ఈ మాత్రం పరిజ్ఞానం లేని వారు మన ఉన్నత విద్యా మండలి చైర్మన్ గా ఏ విధంగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ విధంగా ఒంటెద్దు పోకడ ఏకపక్ష నిర్ణయాలు ఉన్నత విద్యా మండలికి తగదు అందర్నీ సంప్రదించి సరైన నిర్ణయం తీసుకోవాలి. నిర్ణయాలు అనేవి ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని వెనుకకు తీసుకొని ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ విభాగంలోని సీనియర్ ప్రొఫెసర్స్ ని లేదా పదవి విరమణ పొందిన ప్రొఫెసర్స్ ని నియమించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది అన్నారు. లేనియెడల విద్యార్థులకు నష్టం జరిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటే ఏబీవీపీ ఉద్యమాన్ని చేపడుతుందని ఏబీవీపీ హెచ్చరిస్తుంది అన్నారు.

## రూ.224 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేయండి

**మొదటిపేజీతరువాయి..**
మేరకు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బుధవారం రోజున కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని గ్రామీణ రోడ్లు, వంతెనల అభివృద్ధికి సంబంధించి పలు అంశంపై గడ్కరీ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ రోడ్ల విస్తరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనను ఆయన ముందుంచారు. ప్రధానంగా కేశవపట్నం నుండి పాపయ్యపల్లె మీదుగా సైదాపూర్ వరకు 15 కి.మీల మేరకు సింగిల్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని, కొడిమ్యాల నుండి గోవిందారం మీదుగా తాండ్రియాల వరకు 30 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని కోరారు. అట్లాగే చొప్పదండి మండలం అర్నకొండ నుండి గోపాల్ రావు పేట మీదుగా మల్యాల చౌరస్తా వరకు 45 కి.మీల మేరకు, ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ నుండి సింగారం మీదుగా ముస్తాబాద్ మండలం రాంరెడ్డి పల్లె వరకు 15 కి.మీల మేరకు సింగిల్ లేన్ రోడ్డును డబుల్ లేన్ గా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు.

దీంతోపాటు కరీంనగర్ జిల్లాలోని గుండ్లపల్లి పోతూరు రోడ్ (కి.మీ 18/0-2), బావూపేట ఖాజీపూర్ ( కి.మీ2/0-2) వరకు మానేరు నదిపై హైలెవెల్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం సహా మొత్తం 90 కి.మీల మేరకు రోడ్డు విస్తరణ పనులకుగాను రూ.224 కోట్ల నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీకి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని బండి సంజయ్ కు హామీ ఇచ్చారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే సీఆర్ఐఎఫ్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపైనా గడ్కరీ ఆరా తీశారు.

## అరెస్ట్ కోసం కెటిఆర్ తహతహ

**ఎంపి చామల హాట్ కామెంట్స్**



**హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు):** ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్‌కు రంగం సిద్ధమైందని.. మరో రెండు, మూడు రోజుల్లో పోలీసులు ఆయనను అరెస్ట్ చేస్తారని తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేటీఆర్ అరెస్ట్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడు అరెస్టు చేస్తారని కేటీఆర్ ఎదురు చూస్తున్నాడు.ఆయనకు అరెస్టు కావాలనే ఇంట్రెస్ట్ చాలా ఎక్కువగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఫైర్ అయ్యారు.

## అసెంబ్లీలో భూ భారతి

**మొదటిపేజీ తరువాయి..**
నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని మంత్రి చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణిపోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని అరేబియా సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు గాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లోపెట్టి ప్రజాప్రతినిధులు, కవులు, మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని పొంగులేటి తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. 33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. 18 రాష్ట్రాలలోని ఆర్వోఆర్‌లను అధ్యయనం చేసి , ఉత్తమ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని భూభారతిలో పొందుపరిచామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు,ధరణి కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్యలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని, ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని చెప్పారు. అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154, 156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో 4 నెలల పాటు రిజిస్ట్రేషన్‌లు ఆపివేశారని, దీంతో భూములు అమ్ముకొని కుటుంబంలో పెళ్లిళ్లు, చదువుల కోసం ఖర్చుచేద్దామనుకొనే సామాన్య రైతులకు తీవ్ర అసౌకర్యం కలిగిందని మంత్రి పొంగులేటి వివరించారు.

భూభారతి బిల్లుకు సంబంధించి 22-23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో .జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా బిల్లు తయారుచేసేందుకు కృషి చేశామని, సాదాసీదా బిల్లును ప్రజలపై రుద్దే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు,భూమి చుట్టూ మనిషి జీవితం ముడిపడి ఉంటుంది. తరతరాలుగా మనిషి జీవితానికి, భూమికి విడదీయరాని అనుబంధం ఉంది.

భూమి పేదరికాన్ని దూరం చేస్తుంది. ఆత్మగౌరవంతో బతికే అవకాశాన్ని ఇస్తుంది. కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుంది. గ్రామాల్లో భూమే ప్రధాన జీవనాధారం,భూమిని నమ్ముకుని బతికే కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలది. కానీ గత ప్రభుత్వం దీన్ని విస్మరించింది.

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1971లో తీసుకొచ్చిన ఆర్వోఆర్ చట్టం 49 ఏండ్లు విజయవంతంగా అమలైంది.

ప్రజల అవసరాలే లక్ష్యంగా అసైన్డ్ లాండ్స్ మొదలు అనేక విధాన నిర్ణయాలను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలకు ఒక భద్రత, భరోసా. అందుకే ఇప్పటికీ ఇందిరమ్మను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారు.

కానీ వేలాది పుస్తకాలు చదివిన మేధావి 2020 ఆర్వోఆర్ చట్టం ద్వారా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో మూడేండ్లలోనే లక్షలాది కొత్త సమస్యలు తలెత్తాయి.

ఉన్న నాలికకు మందేస్తే కొండ నాలుక ఊడినట్లు ధరణి పరిస్థితి తయారైందని మంత్రి పొంగులేటి విమర్శించారు,రెవెన్యూ అధికారుల స్థాయిలో పరిష్కారం కావాల్సినవి కోర్టుల దాకా వెళ్ళాల్సి వచ్చింది. నాలుగు గోడల మధ్య కూర్చుని వారికి అనుకూలంగా ఉండేలా ధరణిని అప్పటి పాలకులు బలవంతంగా మన నెత్తిమీద రుద్దారు.

ధరణి మానవ సంబంధాలను సైతం దెబ్బతీసింది. మనుషుల మధ్య దూరాన్ని పెంచెండన్నారు. భూ యజమానికి తెలియకుండానే చేతులు దాటిపోయేలా చేసింది. కాళ్ళకింద నేల కదిలిపోయినా పేదలు వారి ఆవేదనను చెప్పుకోడానికీ మార్గం లేకుండా చేసింది.అందుకే మా నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ధరణిని అరేబియా మహా సముద్రంలో వేస్తామని హామీ ఇచ్చారు. మా హామీని తెలంగాణ ప్రజలు విశ్వసించి అధికారాన్ని అప్పగించారు. దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మా సహచర ప్రజా ప్రతినిధుల సమక్షంలో ధరణిని బంగాళాఖాతంలో కలిపి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం. ఇప్పుడు భూ-భారతిని తీసుకొస్తున్నా మని మంత్రి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు, ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు ధరణి కష్టాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి భూ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు,అనేకసార్లు వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి రెవెన్యూ చట్టాలను ఈ కమిటీ అధ్యయనం చేసింది. ఆనాటి దొరలు గడీల్లో కూర్చుని తయారు చేసిన 2020 చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలు కోరుకున్న విధంగా తెలంగాణ భూభారతి డ్రాఫ్ట బిల్లును ఇదే అసెంబ్లీలో ఆగస్టు 2న ప్రవేశపెట్టాం.

ప్రజల నుంచి చట్టం రావాలనే ఉద్దేశంతో అదే రోజున సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచాం. దాదాపు పాతిక రోజుల పాటు ప్రజా ప్రతినిధులు, రైతుసంఘాల ప్రతినిధులు, మేధావులు, సామాన్య ప్రజానీకం, రిటైర్డ్ అధికారుల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించాం. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు సదస్సులు నిర్వహించి అభిప్రాయాలను స్వీకరించారు.

చివరకు 2020 చట్టంలో ప్రధాన పాత్ర పోషించిన తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సూచనలు కూడా స్వీకరించాం. ఒక చట్టం మీద ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించడం రాష్ట్ర చరిత్రలోఇదేప్రథమం.ప్రజాస్వామ్యబద్ధంగా ఈ సభలో భూ-భారతి బిల్లును ప్రవేశపెడుతున్నామని మంత్రి శ్రీనివాసరెడ్డి తెలిపారు ,

### "భూ భారతి ప్రధానాంశాలు"

- గత చట్టం (2020)లోని తప్పులను అధ్యయనం చేసి భూ-భారతి ద్వారా సరిదిద్దడం.
- (ఏ) పార్టు-బీ లో ఉన్న 18 లక్షల ఎకరాలకు పరిష్కారం.
- (బి) గ్రామీణ ప్రాంతాల్లోని ఆబాదీ/గ్రామకంఠం సమస్యలకు పరిష్కారం.
- (సీ) భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం.
- రిజిస్ట్రేషన్ దస్తావేజుల ద్వారా వచ్చే మ్యుటేషన్ జరిగేటప్పుడు ఏవైనా తప్పులు జరిగితే అప్పీల్ చేసుకునే వ్యవస్థ (అథారిటీ)ని ఏర్పాటు చేస్తున్నాం.
- **ధరణిలో కొసమెరుపు:** ఏదైనా పనికొచ్చేదున్నదంటే... రిజిస్ట్రేషన్, ఆ వెంటనే మ్యుటేషన్ జరిగే వెసులుబాటే. కానీ దురదృష్టవశాత్తూ తప్పులకు పరిష్కారం చూపే వ్యవస్థే లేదు.

### వారసత్వం... వంశపారంపర్య భూములు..

- సేల్ డీడ్, వారసత్వం ... కాక కోర్టు ద్వారా వచ్చే, ఓఆర్సీ, 38-ఈ తదితర మొత్తం 14 రకాల భూమి హక్కులపై మ్యుటేషన్ పవర్స్‌ను ఆర్డీఓ
- సాదా బైనామా ... : 2020 నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 9.24 లక్షల దరఖాస్తులకు పరిష్కారం...
- **భూధార్:** దేశంలో ప్రతీ పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో మన రాష్ట్రంలో భూములకూ భూధార్ నంబర్...
- **జమాబందీ, గ్రామ రెవెన్యూ రికార్డులు:** 2014కు ముందు రెవెన్యూ రికార్డుల నిర్వహణ, జమాబందీ ఎలా ఉండేదో ఇకపైనా అదే విధంగా కొనసాగిస్తాం. త్వరలోనే ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమిస్తాం. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించింది.
- **ల్యాండ్ ట్రిబ్యునల్స్:** భూ వివాదాల గ్రీవెన్స్, అప్పీళ్ళ కోసం లాండ్ ట్రిబ్యునల్స్ ఏర్పాటు... అవసరాన్ని, ప్రాంతాన్ని బట్టి సంఖ్యపై ప్రభుత్వ నిర్ణయం...
- **సీసీఎల్ఏ ద్వారా రివిజన్:** ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్‌ను ఈ చట్టంలో పొందుపరుస్తున్నాం.
- ప్రభుత్వ అధికారులపై చర్యలు: ప్రభుత్వ ఆస్తుల్ని ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసే అధికారులపై చర్యలు తీసుకుని శిక్షించే అధికారాన్ని ఈ చట్టం ద్వారా తీసుకొస్తున్నాం.

### అనుభవదారుడు / ఖాస్తు కాలం:

2014కి ముందు పాస్ బుక్కులు కలిగి ఉంది అనుభవదారుడిగా పొసిషన్ లో ఉన్న వారు ధరణి తరువాత రోడ్డున పడ్డారు. గత ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది.

ఈ భూ భారతిలో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతాభావానికి గురి కావాల్సిన అవసరం లేదు. ఈ చట్టం వీరికి సముచిత స్థానం కల్పిస్తాం.

### మాన్యువల్ రికార్డుల భద్రత:

రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయాలలో భద్రపరుస్తాం.

### భూ-భారతి ప్రత్యేకతలు

**ఆరు మాడ్యూళ్ళు:** ఆనాటి ధరణిలో 33 మాడ్యూళ్లు (ఆప్షన్స్) ఉండేవి. ఇప్పుడు దాన్ని ఆరు మాడ్యూళ్ళకు కుదిస్తున్నాం.

**11 కాలమ్‌లు:** గతంలో మాన్యువల్‌గా పహాణీలో 32 కాలమ్‌లు ఉండేవి. వాటిని ధరణిలో ఒకే కాలమ్‌కు గత ప్రభుత్వం కుదించింది. ఇప్పుడు దాన్ని 11 కాలమ్‌లు చేస్తున్నాం.

**డిస్‌ప్లే:** గత ప్రభుత్వం కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతితో ఎవరైనా ఎక్కడి నుంచైనా చూసుకునేలా డిస్‌ప్లే చేస్తున్నాం.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ఎవరైనా భూ భారతి ద్వారా ప్రభుత్వానికి తెలియ చేయవచ్చు. ఆ భూముల్ని పరిరక్షించేలా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం.

భూ-భారతిలో దరఖాస్తు చేసుకున్న భూములున్న ఆసాములకు వారి మొబైల్ నెంబర్లకే అప్‌డేట్స్ వెళ్ళే సౌకర్యాన్ని కల్పిస్తున్నాం.

గతంలో ధరణి కారణంగా అన్యాక్రాంతమైన భూముల వివరాలను భూ భారతి ద్వారా బట్టబయలు చేస్తాం.

2014కు ముందు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల దగ్గర ఉన్న ప్రభుత్వ భూముల జాబితాలోని రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్, భూదాన్, ఫారెస్ట్ తదితర భూముల వివరాలను ధరణిలోని డేటాతో పోల్చి చూసి అన్యాక్రాంతమైన భూముల వివరాలను బహిర్గతం చేస్తాం.

ప్రభుత్వ భూముల్ని ఆక్రమించినవారు ఎంత పెద్దవారైనా వదిలేది లేదు. ఆ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తాం

**మూడు నెలల్లోనే రూల్స్ ఫ్రేమ్ :** గత ప్రభుత్వం ధరణి తెచ్చిన తర్వాత మూడేండ్లు దాటినా రూల్స్ ఫ్రేమ్ చేయకపోవడంతో తప్పులు జరిగాయి. ఆ తప్పుల్ని ప్రజలపై బలవంతంగా రుద్దింది. ఇప్పుడు అలా జరగకుండా మూడు నెలల్లోనే రూల్స్ ఫ్రేమ్ చేస్తాం.

**గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు:** రూల్స్ ఫ్రేమ్ అయిన తర్వాత గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు పెట్టి అధికారులతో పాటు నేను, సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పరిష్కారాన్ని యుద్ధ ప్రాతిపదికన కనుగొంటాం.

**త్వరలో ఒకేచట్టం:** గత ప్రభుత్వం మాటలతో మభ్య పెట్టింది. కానీ ఈ ఇందిరమ్మ ప్రభుత్వం అన్ని చట్టాలను కలిపి ఒకే చట్టాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంది.

ఇద్దరు వ్యక్తులు 2020 ఆర్వోఆర్ చీకటి చట్టాన్ని ప్రజలపై రుద్దారు. పూర్తి అవినీతితో నిండిపోయిన ఈ చట్టం మూడేండ్లకే నూరేండ్లు నిండిపోయేలా ప్రజలే మార్గనిర్దేశం చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా తీసుకొస్తున్న భూ-భారతి చట్టం కనీసం వందేళ్ళు వర్థిల్లుతుందని ఈ ప్రభుత్వం బలంగా నమ్ముతున్నది.

# సంపాదకీయం

## జమిలితో పాటు..మరిన్ని సంస్కరణలు అవశ్యం !


రాజకీయ సంస్కరణల విషయంలో అన్ని పార్టీలదీ ఒకటే దారి. తమకు అనుకూలంగా చట్టాలను మార్చు కుంటున్నారు. అన్నీ ఒకే తాను ముక్కలు గనక వాటి గురించి అంతా తలూపుతున్నారు. ఇప్పుడు జమిలి ఎన్నికల విషయంలో రాజీపడ్డట్లు కనిపించినా అందరికీ అవసరమే. కాకపోతే తరచూ ఎన్నికలను రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. ఎన్నికల్లో లబ్ది పొందేందుకు, అధికారం పొందేందుకు మాత్రమే వాటి తాపత్రయం తప్ప..ప్రజలపై ప్రేమతో కాదు. ఇకపోతే జమిలితో పాటు అనేక సంస్కరణలు తేవాల్సి ఉంది. ప్రధానంగా రాజ్యాంగం,దేశంపై అవగాహన లేని క్రిమినల్ చరిత్ర ఉన్నవారు కూడా రాజకీయ నాయకులుగా ఎదుగుతున్నారు. వీరిని ఎన్నికలకు దూరం పెట్టగలగాలి. చదువు సంధ్యలు లేకుండా ఏకంగా పార్లమెంటులో అడుగుపెడుతున్నారు. అలాగే ఒకటికి మించి రెండుమూడు చోట్ల పోటీ చేసే పద్దతికి స్వస్తి చెప్పాలి. ఎందుకంటే కనీసం మూడుచోట్ల లేదా రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. దీంతో గెలిచాక ఒకటి వదులుకున్నా, దాని ఖర్చు ప్రజలపై పడుతోంది. ఇలా పోటీ చేసి, రాజీనామా చేస్తే ఆ ఖర్చును వ్యక్తి లేదా, పార్టీ భరించేలా నిబంధన పెట్టాలి. లేదా అలాంటి వెసలుబాటు లేకుండా చేయాలి. మరో విషయం ఏమంటే ఎమ్మెల్యేలు,ఎంపిల జీతభత్యాలు, పెన్షన్లను రద్దు చేయాలి. వారికి ఇచ్చే భత్యాలు కూడా లెక్కకు మించి ఉంటున్నాయి. ఈ జమిలి ఎన్నికల సంస్కరణలోనే వీటిని చేర్చాలి. అప్పుడే రాజకీయ సంస్కరణకు అర్థం ఉంటుది. జమిలి ఎన్నికల ద్వారా తరచూ ఎన్నికలు జరిగే అవకాశం ఉండదు. కనక దేశాభివృద్ధికి దోహద పడుతుందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభిప్రాయపడ్డారు. ఇది ముమ్మాటికీ నిజం. తరచూ ఎన్నికల వల్ల ఖజానా గుల్ల కావడంతో పాటు, ప్రజలను సమస్యల నుంచి తప్పిస్తున్నారు. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ఎన్నికల పక్రియ సరళతరం కానుంది. ఓ రకంగా చెప్పాలంటే అది




అభివృద్ధికి మరింత ఊతమిస్తుంది. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుంది. ఏటా ఓట్ల కోసం వచ్చే నేతలతో ఓటర్లు విసిగిపోయారు. ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు తప్ప..తమ హయాంలో జరిగిన అవినీతి గురించి మాట్లాడడం లేదు. అందుకే ప్రజలు తరచూ అటువంటి పరిస్థితి కోరుకోవడం లేదు. జమిలి బిల్లు పార్లమెంటుకు వచ్చిన తరుణంలో ఇంకా అనేక ప్రతిపాదనలను జోడించి రాజ్యాంగ సవరణకు పూనుకో వాలి. సమిలి కార్యరూపం దాలిస్తే..ఏదో ఒక ఎన్నిక కోసం ఓటర్లు ఏటా పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిన పని ఉండదు. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రస్తుతమున్న జీడీపీకి అదనంగా మరో 1.5శాతం పెరుగుతుంది. ఒకవేళ ఇదే జరిగితే జీడీపీ 10శాతం పెరగడానికి ఎక్కువ సమయం పట్టదు. దాంతో ప్రపంచంలోనే మూడు, నాలుగో ఆర్థిక శక్తిగా మన దేశం నిలుస్తుంది. ఓట్లు అడగాల్సి వస్తే.. అభివృద్ధికి సంబంధించిన హామీలు ఎందుకు అమలు చేయడంలేదు అన్న ప్రశ్నకు ప్రజలకు సమాధానం ఇవ్వాలి. అయితే జమిలి ఒక్కటే పరిష్కారం కాదు. తరచూ ఎన్నికల నిరోధంతో పాటు, రాజకీయ పార్టీల పెత్తనానికి కళ్లెం వేయగలిగేలా చూడాలి. ప్రజాధనం వృధాను అరికట్టగలగాలి. ఈ క్రమంలో దేశంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చకు తెరపడింది. ఎట్టకేలకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఒకే దేశం – ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టారు. అంతకుముందు ఈ రెండు బిల్లులకు డిసెంబర్ 12న కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఈ బిల్లును డిసెంబర్ 17న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అయితే ఈ బిల్లు అమలయ్యాక ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం పడిపోతే ఆ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చాలా మందిలో మెదులుతోన్న ప్రశ్న.రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయిన తర్వాత వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎలా పని చేస్తుందనేది ఆ ప్రశ్నలలో ఒకటి. ఈ బిల్లు అమలు తర్వాత ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం పడిపోతే, ఏం చేయాలి అన్న విషయాన్ని చర్చించాలి. అయితే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లులో అనేక రకాల నిబంధనలు రూపొందించారు. అవిశ్వాస తీర్మానం వల్లనో, లేదా మరేదైనా కారణంతోనో ప్రభుత్వం పడిపోతే.. అలాంటి పరిస్థితుల్లో ఏం చేస్తారనే నిబంధన కూడా ఇందులో ప్రస్తావించారు. ఈ నిబంధన ప్రకారం, ఆ సమయంలో ఆ రాష్ట్రంలో మళ్లీ మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలి. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. కొత్త అసెంబ్లీ పదవీకాలం వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు మాత్రమే ఉంటుంది. అంతే కాకుండా ఎన్నికల నిర్వహణకు ముందు అవసరమైన అన్ని అవసరాలను పూర్తి చేయాలని కూడా ఎన్నికల కమిషన్‌ను బిల్లులో ఆదేశించింది. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల కోసం ఎన్నికల సంఘం కూడా ముందస్తుగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని బిల్లులో వివరంగా తెలిపింది. బిల్లులో తెలిపిన నిబంధన ప్రకారం, లోక్‌సభ లేదా అసెంబ్లీని మధ్యలోనే రద్దు చేయాల్సి వస్తే, మిగిలిన కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తారు. బిల్లులో ఆర్టికల్ 82 (ఎ), 172, 327లను చేర్చాలనే ప్రతిపాదన కూడా ఉంది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన 82 (ఎ)లో ఉంది. ఇది కాకుండా, 83లో పార్లమెంటు సభల పదవీకాలానికి సంబంధించిన నిబంధన కూడా ఉంది. అంతే కాకుండా సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రపతి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయాన్ని కూడా చట్టంలో పేర్కొన్నారు. అయితే 2029 లోక్‌సభ ఎన్నికలు మునుపటిలా నిర్వహించనున్నారు. ఆ తర్వాత వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు అమలులోకి వస్తుందని తెలుస్తోంది. ఈ బిల్లుకు అనుకూలంగా 269 ఓట్లు, వ్యతిరేకంగా 198 ఓట్లు వచ్చాయి. దీంతో బిల్లుపై చర్చలో జేపీసీకి అభ్యంతరం లేదని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేయడంతో దీనిసి జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రతిపాదించారు. సమిలితో పాటు పైన ప్రస్తావించిన అనేక అంశాలను చట్టంలో పొందుపరిస్తేనే బిజెపి చిత్తశుద్ది చాటుకోగలదు. అందుకు అన్ని రాజకీయ పార్టీలు ఇందుకోసం పట్టబట్టాల్సి ఉంది.

## కొత్త ఏడాదిలో మహాకుంభమేళా

కొత్త ఏడాదిలో కుంభమేళా పలకరించబోతున్నది. అయితే ఇక్కడ మార్గదర్శకాలు ఇప్పుడు చర్చగా మారాయి. ప్రయాగ్‌రాజ్ లోని మహా కుంభమేళా మరోసారి వార్తల్లో నిలిచింది. కొత్త సంవత్సరంలో జరగనున్న మహా కుంభమేళాలో సనాతనయేతరుల ప్రవేశాన్ని అఖారా పరిషత్ నిషేధించిన తరువాత, ఇప్పుడు నాగ సన్యాసులు కూడా కొత్త మార్గదర్శకాలను వెల్లడించారు. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. సనాతనేతరులు ఎవరైనా మన సంస్కృతితో ఆటలాడినా లేదా జాతర ప్రాంతంలోకి ప్రవేశించినా వారిని పట్టుకుని కఠిన శిక్షలు వేస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యపై తామే చర్యలు తీసుకో గలమని నాగ సన్యాసులు చెబుతు న్నారు. ఇంతకు ముందు కూడా సనాత నేతరులు మహాకుంభంలోకి ప్రవేశించ కుండా నిషేధం విధిస్తున్నట్లు అఖారా పరిషత్ ప్రకటించింది. ఇప్పుడు నాగ సన్యాసులు.. అఖారా పరిషత్ ప్రకటనకు



మద్దతిచ్చి దాన్ని అమలు చేసే దిశగా గట్టి అడుగులు వేశారు. మహా కుంభమేళాలో పాల్గొనే వారు నుదుటిపై తిలకం, మణికట్టుపై కాలవ తప్పనిసరి అని.. సందర్శకుల మహా కుంభమేళా ప్రాంతంలోకి ప్రవేశించ డానికి ఇవి ఉన్నవారికి మాత్రమే అనుమతించబడతారని స్పష్టం చేసింది. హిందూ మతాన్ని భ్రష్టు పట్టించే ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్లు జునా అఖారాకు చెందిన నాగ సన్యాసి శంకర్ భారతి తెలిపారు. మత స్వచ్ఛతను కాపాడేందుకే ఈ మార్గదర్శకాన్ని అమలు చేశామని చెప్పారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. ఖారాస్‌లోని అన్ని ప్రవేశాల వద్ద పోలీసులను మోహరింప జేస్తామని.. తాము చేసిన మార్గదర్శకాలను పాటించేలా చూస్తామని నాగ సన్యాసులు చెప్పారు. ఎవరైనా దోషులుగా తేలితే శిక్ష అనుభవించాల్సిందే నని చెప్పారు. అఖారాకు చెందిన మహిళా సన్యాసి దివ్య గిరి ఈ మార్గదర్శకానికి మద్దతు ఇస్తూ మహిళా సన్యాసుల అఖారాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అఖారా వెలుపల ఒక మహిళా సాధువును ఉంచుతామని వారు వారి నుదిటిపై తిలకం పెట్టుకున్న తర్వాత మాత్రమే లోపలికి అనుమతించనున్నామని చెప్పారు. ఃారతీయ సంస్కృతి త్రివేణీ సంగం పవిత్రతను కాపాడేందుకు ఈ చర్య తీసుకున్నట్లు నాగ సన్యాసులు స్పష్టం చేశారు. నాగ సన్యాసిలు తమ అఖారాలు దీనితో సంబంధం ఉన్న సాధువులు మొత్తం జాతర ప్రాంతాన్ని గమనిస్తారని చెప్పారు.

# వ్యవసాయాభివృద్ధికి తక్షణ చర్యలు

వ్యవసాయ చట్టాలు తీసుకుని వచ్చినప్పుడు ప్రధాని మోడీ కనీసం ఏ ఒక్కరితోనూ చర్చించలేదు. దేశవ్యాప్తంగా నిరసనలు రావడంతో దానిని వెనక్కు తీసుకున్నారు. అప్పుడు చట్టంలోని మంచిని గానీ చెడును గానీ పార్లమెంటులో కనీసంగా అయినా చర్చించలేదు. ఈ క్రమంలో పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. నిజానికి మద్దతు ధరలతో పాటు, వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు రావాల్సి ఉంది. రైతులకు మద్దుతతో పాటు, వ్యవసాయ ప్రోత్సాహకాలు అందాలి. అలాగే దేశంలో ఆహారధాన్యాల దిగుబడిని పెంచుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే వీటి దిగుబడులు తగ్గించుకోవడం ద్వారా దేశీయంగా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని పేర్కొంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పిలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది. రైతుల ఇక్కట్లకు, ఆత్మహత్యలకు రుణభారమే కారణమని కమిటీ అభిప్రాయపడింది. అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేసేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రానికి సూచించింది.

2021–22, 2024–25 మధ్యకాలంలో వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు అధిక కేటాయింపులు జరిపినప్పటికీ



కేంద్ర ప్రణాళికా వ్యయంలో ఈ శాఖ వాటా 3.53 శాతం నుండి 2.54 శాతానికి తగ్గిపోయిం దని కమిటీ అందజేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కమిటీ కోరింది. పిఎం–కిసాన్ పథకానికి అందిస్తున్న వార్షిక మద్దతును రూ.6,000 నుండి రూ.12,000కు పెంచాలని కూడా సిఫారసు చేసింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడడానికి సాధ్యమైనంత త్వరగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వారికి లభించాల్సిన హక్కులు దక్కుతాయని కమిటీ తెలిపింది. ఇకపోతే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వేతనాలు పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా లేవని పార్లమెంటరీ ప్యానెల్ తెలిపింది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ప్యానెల్ తన నివేదికను పార్లమెంట్ ఉభయ సభల్లో సమర్పించింది. ఈ పథకం కింద 2008 నుంచి చెల్లిస్తున్న వేతనాలపై ప్యానెల్ అధ్యయనం చేసింది. తక్కువ వేతనాలు, ఆలస్యంగా చెల్లింపులు చేయడం కార్మికుల్ని నిరుత్సాహపరుస్తుంది.

మెరుగైన వేతనాలు ఇచ్చే ప్రాంతాలకు వలస, పనికోసం వెళ్లడానికి ప్రేరేపిస్తుందని ప్యానెల్ పేర్కొంది. ఉపాధి వేతనాల స్థిరీకరణ కోసం ఇప్పటి వరకూ బేస్ రేట్‌ను సవరించలేదని ప్యానెల్ విమర్శించింది.

# ప్రపంచం మీద డాలర్ పెత్తనం

అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చని కొంత మంది ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెత్తనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది. ఈ ఆర్థిక, ద్రవ్యవ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి అండగా నిలబడుతుంది. ఈ అంత ర్జాతీయ వ్యవస్థకు ఇరుసు అమెరికన్ డాలర్. ఐతే, అంతర్జా తీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉంటోంది. ఉదాహరణకు, 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అను కోండి. దాన్ని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండుదేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీల్లేదు. ఆ రెండు దేశాల వద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెండు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది.

విధంగా డాలర్ మీద ఆధారపడటం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచమంతా డాలర్‌ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాలనుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటుగనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు. అలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగివుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి

వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడు తుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయంలేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది.

ప్రస్తుతం దాదాపు మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొం టున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందులపాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం



లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరుకుంటున్నాయి. ఇటీవల కజన్‌లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తమైంది.

మ పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జేనెట్ యెలెన్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ 'అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుం టాయి.' అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని యె÷–లెన్ చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగుతున్న సంగతినీ అంగీకరించారు. అలా ఏక పక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయించే దుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశా లున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్త నమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్‌ను అంత ర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తేలుతోంది.

డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్‌లనో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది.

ముడి చమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధిం చాక వాటి నుండి తట్టుకోడానికి రష్యా తన ముడిచమురు కొనుగోలు చేసేవారు రూబుళ్లలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది. అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జేనెట్ యెలెన్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు. కాని ఇప్పుడు ఆమె ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవలసి వస్తోంది. ఇప్పుడు ట్రంప్ డాలర్ పెత్తనాన్ని కాదనుకుంటున్న దేశాలను బెదిరించ డానికి పూనుకుంటు న్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై సుంకాన్ని వందశాతం పెంచుతానంటూ రంకెలు వేస్తున్నాడు. అంటే డాలర్ పెత్తనం ఎలాగైనా కొనసాగ డానికి అమెరికన్ సామ్రాజ్యవాదం తన శక్తిని వినియోగిస్తోం దన్నమాట. ఇటువంటి బెదిరింపుల ప్రభావం బలంగానే ఉంటుంది. ఎందుకంటే డాలర్ ప్రమేయం లేకుండా వ్యాపారం చేసుకోవడం అనేది ఒక్క పట్టున సాధ్యపడేది కాదు.

ఈలోపున అమెరికాకు ఆ దేశాలు చేసే ఎగుమతులు కుదించుకు పోతే అప్పుడు ఆ దేశాల దగ్గరుండే డాలర్ నిల్వలు మరీ వేగంగా హరించుకుపోతాయి. అప్పుడు ఆ దేశాలు మరింతగా ఇబ్బందుల పాలౌతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు. కాని ఇప్పటికే ఆ దేశాలు ఐ.ఎం.ఎఫ్, లేదా ప్రపంచబ్యాంక్ దగ్గర రుణాలు పొంది వుంటే ఆ రుణాలకు చెల్లించవలసిన వాయిదాలు డాలర్ల రూపంలోనే చెల్లించాలి.

ఆ డాలర్ల నిల్వలు హరించుకుపోతే అప్పుడు ఆ దేశాలు రుణ ఎగవేతదారులుగా నిలబడవలసి వస్తుంది. దానివలన కొత్త షరతులను భరించవలసి వస్తుంది. అందుచేత ట్రంప్ ప్రకటిస్తున్న హెచ్చరికలను సీరియస్‌గానే తీసుకోవాలి. ఉదార వాద ఆర్థికవేత్తలు ఎంతో సౌమ్యంగా చిత్రించే సామ్రాజ్యవాదపు ఆధిపత్య రూపం కాస్తా ఇప్పుడీ ట్రంప్ బెదిరింపులతో పూర్తిగా బయటపడి పోయింది! అయితే ఈ బెదిరింపులను ఎదుర్కొనే దేశాలు డాలర్ పెత్తనం నుండి బయటపడవలసిన అవసరాన్ని మరింతగా గుర్తించడానికే ఈ బెదిరింపులు తోడ్పడతాయి. డాలర్–రహిత అంతర్జాతీయ వ్యాపారం పుంజుకోడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఈ సంగతి కజన్ శిఖరాగ్ర సమావేశానికీ తెలుసు. ట్రంప్ బెదిరించగానే భారత దేశంతో సహా పలు దేశాలు తమకు ఈ డాలర్–రహిత వాణిజ్యం పట్ల ఆసక్తి లేదంటూ ప్రకటించాయి. అమెరికా దృష్టిలో బుద్ధిమంతు లని పించుకోడానికి ఈ ప్రకటనలు ఉపయోగపడవచ్చు. కాని అమెరికా పెత్తనానికి సవాలు తీవ్రంగానే ఎదురవుతోందన్నది మాత్రం వాస్తవం. తమ దేశాల ఆధిపత్యానికి సవాలు తీవ్రంగా ఎదురవుతోందన్న వాస్తవాన్ని గుర్తించిన పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలే కాకుండా ఆ దేశాల్లోని సోషల్ డెమాక్రటిక్ పార్టీలు సైతం ఉక్రెయిన్ విషయంలో గాని, గాజా విషయంలో గాని మరింత ఐక్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఏ విధమైన అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పరచాలన్న విషయం మీద ఇంకా బ్రిక్స్ దేశాల నడుమ ఒక స్పష్టత రాలేదు. ఇలా ఏర్పడే ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ డాలర్‌కు బదులు మరొక దేశపు కరెన్సీకి ఆధిపత్యాన్ని కట్టబెట్టేదిగా మాత్రం ఉండకూడదు. అలా జరగాలంటే ఇప్పుడు ఏ సూత్రాల ప్రాతిపదికపై అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోందో ఆ సూత్రాలే, ఆ నియమాలే మారిపోవాలి.

అంతేకాదు. అంతర్జాతీయ వాణిజ్యంలో వాణిజ్యలోటు పెరుగుతున్న దేశాల మీద ఆ లోటును భర్తీ చేసే భారాన్ని మోపే పద్ధతి కూడా మారాలి.

# విద్యారంగం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఏ ప్రభుత్వానికైనా విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే ఉంటుందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యాలయాలను బాగు చేయాలని భారాస అధినేత కేసీఆర్‌కు మొదట్లో ఉండేదని.. ఆ తరువాత ఆయన అంచనాలు మారిపోయాయన్నారు. విద్యాలయాలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాల చర్చలో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. 'విద్యా రంగాన్ని ప్రక్షాళన చేయాలనే కసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపిస్తోంది. స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాలతో ఆ విషయం స్పష్టం అవుతోంది. అయితే, ముఖ్యమంత్రి ఒక్కరికే ఆ తపన ఉంటే సరిపోదు. పైనుంచి కింది స్థాయి వరకు ఆచరించాలి. ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధ్యాయులు సంతోషంగా లేరు. పాఠశాల విద్యకు సంబంధించి 20వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్వ శిక్షా అభియాన్ వాళ్లకు కనీస వేతనం అమలు చేయడం లేదు'




అని కూనంనేని పేర్కొన్నారు. 'ప్రజలు తమ ఏడాది సంపాదనలో విద్య, వైద్యానికే 90శాతం ఖర్చు చేస్తున్నారు. పేదవాళ్లు మరింత పేదవాళ్లవుతున్నారు. ఆశ్రమ, గురుకుల పాఠశాలలను గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. నాణ్యమైన విద్యను అందించకపోగా బర్రెలు, గొర్రెలు కాసేలా ప్రేరేపించారు. పేదవాడు విద్యకు దూరం కావాలని కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేసిందని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ అన్నారు.

'ఏడాది కాలంలో వెయ్యి మంది గురుకుల పాఠశాలల విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. 40 మంది విద్యార్థులు చనిపోయారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయనిభాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు.



## ఆదివారం అంగడిలో జేబు దొంగలను నివారించండి

**తుర్కయంజాల్,వెలుతురు: డిసెంబర్ 18**

బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ ఆధ్వర్యంలో ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో తుర్కయంజాల్ సెక్టార్ ఎస్సై కె.రాజుని కలసి ప్రతి ఆదివారం తుర్కయంజాల్ అంగడిలో సెల్‌ఫోన్ దొంగతనాలు, జేబు దొంగ తనాల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఆర్థికంగా నష్ట పోతున్నారని కాబట్టి ఈ ప్రజా సమస్యను వెంటనే పరిష్కారానికై పోలీస్ సిబ్బందిని ఆదివారం అంగడిలో నియమించాలని, బైక్ పెట్రోలింగ్ నిర్వహించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు లపంగి రాజు జనరల్ సెక్రటరీ మల్లెల రఘు, సీనియర్ నాయకులు జంతుక సైదులు, చెట్టుపల్లి వాసుదేవ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## నవగ్రహ నందిదేవతలకు ప్రతిష్ట మహోత్సవం

**తుర్కయంజాల్,వెలుతురు: డిసెంబర్ 18**

రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూరు శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయం మల్లన్న గుట్ట ప్రాంగణంలో శ్రీ నవగ్రహ నందిదేవత



ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంకి హాజరైనా తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అనంతరం నవగ్రహ దేవతలను దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, సంగీత మోహన్, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు మేకం లక్ష్మయ్య, ధనమ్మ, వేముల భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల అధికారులపై దాడి కేసులో అందరికీ బెయిల్ మంజూరు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, డిసెంబర్ 18:**



రాష్ట్రంలో ఎంతో అలజడి సృష్టించిన లగచర్ల అధికారులపై దాడి చేసిన కేసులో అరెస్టు అయిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తో సహా అందరికీ బుధ వారం బెయిల్ లభించింది, దీంతో బీఆర్ఎస్ పార్టీ నేతలు హర్షం వ్యక్తంచేస్తు న్నారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు అయిన సురేష్‌తో పాటుగా కేసు కు సంబంధించిన 24 మందికి బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది, అయితే లగచర్ల భూముల విషయంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా అధికారులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదయ్యాయి,

## ఘనంగా ఏపీ టీపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 18 వెలుతురు:**

ఏపీ టీపీసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన సందర్భంగా ఎస్ ఎస్ ఆర్ క్యాంప్ ఆఫీస్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరిసతీష్ రెడ్డి మాట్లాడుతూ షర్మిలమ్మ వైయస్సార్ అడుగుజాడల్లో నడుస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి బాటలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం ఏర్పడేలా పోరాటం చేయాలని అన్నారు.

ఎన్ డి ఏ కూటమి మీద వారు ఇచ్చిన హామీలు ఒకటి నెరవేర్చలేరని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి చెప్పేదే చేస్తాం చేసేదే చెప్తాం అనే నినాదంతో ముందుకు వెళ్లాలని షర్మిలమ్మ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి ఏపీటీపీసీసీ రాష్ట్ర అధికార ప్రదినిది కాసర గడ్డ నాగార్జున, కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, మేకల మైకల్, ఫణింద్ర కుమార్, రేష్మ, రామకృష్ణారెడ్డి, బాబురావు (కె. బి.ఆర్), నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను అదానీకి దోచిపెడుతున్న మోడీ

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం



**కూకట్‌పల్లి, డిసెంబర్ 18, వెలుతురు:**

ప్రజల ఆస్తులు, దేశ సంపదను అదానీకి ప్రధాని మోదీ దోచిపెడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా గౌతమ్ అదాని ఆర్థిక అవకతవకలు, అవినీతి ఆరోపణలు, మణిపూర్ లో అల్లర్లపై మోడీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపుమేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో భాగంగా నెక్లెస్ రోడ్లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి రాజ్ భవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అవినీతి ద్వారా దేశ ఆస్తులన్నీ ఆదానీ కొల్లగొట్టారని, ఆయనను వెంటనే అరెస్టు చేసి విచారిస్తే విషయాలన్నీ బయటపడతాయని అన్నారు. భారత్‌లో అరెస్ట్ కాకుండా ఆయనపై విచారణ జరగకుండా ఆదాని ని మోడీ కాపాడుతున్నాడని అన్నారు.

ఆదానీపై అమెరికాలో కేసులు నమోదైతే ప్రధాని మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఆయన మౌనం వీడకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. 75 ఏళ్ళ పాటు కష్టపడి కాంగ్రెస్ పార్టీ దేశ ప్రతిష్టను పెంచిందని అన్నారు. కానీ ఆదానీ ప్రధాని ఇద్దరూ కలిసి దేశం పరువు తీశారని మండిపడ్డారు. వ్యాపారం చేసేందుకు ఆదానీ లంచాలు ఇచ్చారని అమెరికా సంస్థలు తేల్చాయని చెప్పారు. అసలు ఆదానీని కాపాడడానికి ఎవరు ప్రయత్నిస్తున్నారో ముందు ఆ విషయం తేలాలని అన్నారు. అదానీ గ్రూప్ కంపెనీల కార్యకలాపాలు, విదేశాల్లో పెట్టుబడులపై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జెపీసీ) తో విచారణ జరిపించాలని, పారిశ్రామిక రంగంలో ఇలాంటి అనైతిక బంధాలకు, విధానాలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకమన్నారు. పీఎం మోదీ, అదానీ బంధం దేశం మొత్తానికి తెలుసని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, మహిళా డివిజన్ అధ్యక్షురాళ్లు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### అదాని అవినీతి వ్యవహారంపై చలో రాజభవన్ కార్యక్రమానికి

# తరలిన కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు..

**కూకట్‌పల్లి, డిసెంబర్ 18 వెలుతురు:**

ఏఐసీసీ చలో రాజభవన్ పిలుపు కార్యక్రమంలో భాగంగా బుధవారం కూకట్ పల్లి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నెక్లెస్ రోడ్‌లోని స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు బస్సుల్లో, కారుల్లో, ద్విచక్రాలపై తరలి వెళ్లారు. ముందుగా మూసాపేటలోని ఇందిరా గాంధీ విగ్రహానికి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జెండా ఊపి బస్సు ర్యాలీని ప్రారంభించారు. నెక్లెస్ రోడ్ లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్ రెడ్డి జిందాబాద్.. రాహుల్ గాంధీ జిందాబాద్, కాంగ్రెస్ జిందాబాద్, అంటూ నినాదాలు చేశారు. మోడీ పాలన తీరును ఎండగడుతూ దేశ ప్రతిష్టను దిగజార్చిన ఆదానిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుండి రాజ్ భవన్ వరకు సీఎం రేవంత్ వెంట బండి రమేష్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు, తదితరులు పాదయాత్రగా వెళ్లారు.



# ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు తన వంతు కృషి

### - పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ..

**కూకట్‌పల్లి, డిసెంబర్ 18 వెలుతురు:**

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని శేర్లింగంపల్లి ఎమ్మెల్యే పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు.

వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ కమాన్ నుండి రూ.1 కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న రోడ్డు డివైడర్ (విభాగిని) పనులను బుధవారం ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేసేందుకు వీలుగా రోడ్డు మధ్యలో డివైడర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి స్థాయిలోకి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా డివైడర్ ను నిర్మించాలని, డివైడర్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు



పాటించాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ గురువా రెడ్డి, నాయకులు సైదేశ్వర్, శర్మ ,మల్లయ్య, నరేందర్ , శ్రీనివాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఫూలే దంపతులకు భారత రత్న ప్రకటించాలి

### - జాజుల లింగం గౌడ్

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 18:**

మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి 194వ జయంతి ఉత్సవాలను జనవరి 3న రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. జయంతి ఉత్సవాలకు సంభందించిన గోడ పత్రికలను ఓయూ లోని ఆర్ట్స్ కళాశాల వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అద్యక్షతన ఆవిష్కరించినట్లు లింగంగౌడ్ తెలిపారు.

లింగంగౌడ్ మాట్లాడుతు సావిత్రిబాయి ఫూలే అనగానే అందరికీ ఆమె జ్యోతిరావు ఫూలే భార్యగానో, లేదంటే తొలి మహిళా ఉపాధ్యాయురాలుగానో మాత్రమే ఆమెను తెలుసుకుంటున్నారు. భారతీయ సమాజంలో వేల ఏళ్లుగా పాతుకుపోయిన కుల వివక్ష, అంటరానితనం, సతీ సహ గమనం, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాల వంటి అసమం జస, అమానవీయ పద్ధతులను రూపుమాపి, అందరూ సమానమే, అందరికీ చదువు, సంపద హక్కులు కావాలని, చదువొక్కటే మనిషిని సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేస్తుందని చాటి చెప్పి, అందుకోసం తన యావజ్జీవితాన్ని ధారపోసిన గొప్ప సంఘసంస్కర్త, త్యాగశీలి అన్నింటికీ మించి సమాజాన్ని అమితంగా ప్రేమించిన సామాజిక ప్రేమ స్వరూపిణిగా ఆమెను మనం గుర్తుంచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మణి మంజరి, వలిగొండ నరసింహ, నామా సైదులు విజయ్ నాయక్ ఎల్లెందర్,గౌతమి, శ్రీను నాయక్, తారా కేశ్వరి, స్వర్ణ,రమాదేవి, రంజిత్, రాజేశ్వరి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్న చిరుమర్తి రాజు..

**కూకట్‌పల్లి డిసెంబర్ 18 వెలుతురు:**

ఏఐసీసీ పిలుపుమేరకు ఆదాని కుంభకోణాలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన ఛలో రాజ్‌భవన్ కార్యక్రమంలో భాగంగా రాజ్ భవన్ వరకు నిర్వహించిన



ర్యాలీలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు పాల్గొన్నారు. అంతకు ముందు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ను కలసి రాజు కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కాంగ్రెస్ సైనికులు దేశ ప్రతిష్టకు పహారా కాయాల్సిన సందర్భం ఇది అన్నారు.

## పోరాటాలతోనే మైనారిటీలకు
# హక్కులు సాధించవచ్చు

### షేక్ రబ్బానీ, ఝురాసంగం మండల ఎంఐఎం పార్టీ అధ్యక్షులు...

**ఝురాసంగం,వెలుతురు న్యూస్, డిసెంబర్ 18:** భారతదేశంలో పోరాటాలతోనే మైనార్టీ హక్కులను సాధించవచ్చు అని రాష్ట్ర అధ్యక్షుడు బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ చెప్పేవారని పేర్కొంటూ మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఐఎం పార్టీ ఝురాసంగం మండల అధ్యక్షులు షేక్ రబ్బానీ బుధవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. వారు వెల్లడించిన పూర్తి వివరాల ప్రకారం....నాగరికత ఎంత అభివృద్ధి చెందినా, ఇంకా చాలా దేశాల్లో మానవ హక్కులకు, ముఖ్యంగా మైనారిటీల హక్కులకు పూర్తి భరోసా లేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భారత్ లాంటి దేశాల్లో సైతం మానవ హక్కుల హననం కొనసాగుతోందని, కేంద్రంలో నరేంద్ర మోదీ అధికార పగ్గాలు చేపట్టాక ఈ ధోరణి మరింతగా పెరిగిపోయిందని ఆరోపించారు.

అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని చెప్పుకొంటున్న భారత్‌లో కొనసాగుతున్న మానవ హక్కుల హననంపై ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అక్షింతలు వేసినా పాలకుల్లో చలనం లేకపోవడం విడ్డూరమని అన్నారు. ఏ దేశ స్వాతంత్ర్య, అభివృద్ధి ఫలాలైనా ప్రాథమికంగా అన్ని వర్గాలు, అన్ని సముదాయాల ప్రజలకు నిష్పక్షపాతంగా, న్యాయంగా అందినప్పుడే స్వాతంత్ర్యానికి, అభివృద్ధికి ఒక అర్థముంటుందని తెలిపారు. భిన్న కులాలు, మతాలు, సముదాయాలకు ఆలవాలమైన మన దేశంలో అన్ని సమాజాల వారికి, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు హక్కులు, అభివృద్ధి ఫలాలు అందు తున్నాయా అంటే, సమాధానం కోసం నీళ్ళు నమలాల్సిందేనని అన్నారు. దేశ జనాభాలో సుమారు 30 కోట్ల వరకూ ముస్లిం జనాభా ఉందని, వీరిలో 60 శాతం మంది నేటికీ దారిద్ర్యరేఖ దిగువన దుర్భరమైన జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం విద్యా లేమియే నని తెలిపారు. 2001లో ముస్లింలలో నిరక్షరాస్యత 42.5 శాతం ఉంటే అది ఇప్పుడు 42.7 శాతం ఉందని, అంటే రెండు దశాబ్దాల తరువాత కేవలం 0.2 శాతం మాత్రమే పెరుగుదల నమోదైందని తెలిపారు. వివిధ పథకాలు, కార్యక్రమాల కింద ముస్లింలలో అక్షరాస్యతను



పెంచడానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని చెప్పుకుంటున్నా ఇలాంటి దయనీయ స్థితికి కారణాలేమిటన్న ప్రశ్నకు సరియైన సమాధానం లేదని అన్నారు. దీన్ని బట్టి మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు ఎంత గొప్పగా కృషి చేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. పాఠశాలకు వెళ్ళి మధ్యలో బడి మానేస్తున్న పిల్లల జాబితాలో కూడా ముస్లింల పిల్లలే అధికంగా ఉంటున్నారని, వారు తమ పిల్లలను చదివించు కోలేక పోవడానికి ఆర్థిక వెనుకబాటు మరో కారణమని పేర్కొన్నారు. ఏదో ఒక రకంగా అష్టకష్టాలు పడి ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు దొరకడం అంత సులభం కాదని, ప్రభుత్వ రంగంలోనే కాదు, ప్రైవేట్ రంగంలో కూడా వారికి ఉద్యోగాలు లభించవని పేర్కొన్నారు. కొన్ని విభాగాలు అనధికారికంగా ముస్లింలకు ఉద్యోగాలు ఇవ్వరాదన్న విధానాన్ని పాటిస్తున్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. ఐఏఎస్లో మూడు శాతం, ఐఎఫ్ఎస్లో 1.8 శాతం, ఐపిఎస్లో నాలుగు శాతం, రైల్వేలలో 4.5 శాతం, పోలీస్ శాఖలో ఆరు శాతం, ఆరోగ్య శాఖలో నాలుగు శాతం, రవాణా శాఖలో 6.5 శాతం, న్యాయ శాఖలో 7.8 శాతం మాత్రమే ముస్లింలకు ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. ఇక రాజకీయ ప్రాతినిధ్యానికొస్తే 245 మంది రాజ్యసభ సభ్యులకు 24 మంది, 545 మంది లోక్ సభ సభ్యులకు కేవలం 27 మంది మాత్రమే ముస్లిం మైనారిటీలున్నారని తెలిపారు. దేశం మొత్తం మీద 4 వేల పైచిలుకు శాసనసభ్యులుంటే, కనీసం 4 వందల మంది కూడా ముస్లిం శాసనసభ్యులు లేరని పేర్కొన్నారు. సుమారు పదిహేను రాష్ట్రాల శాసనసభల్లో కూడా ముస్లింల ప్రాతినిధ్యం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా పాలకవర్గాలు కళ్ళు తెరిచి ముస్లింలకు న్యాయవంతమైన, రాజ్యాంగబద్ధమైన వారి హక్కును వారికి అందించడానికి ప్రయత్నించాలని కోరారు. సచార్ నివేదికను అమలుపరిస్తే గొప్ప మేలు చేసినవారవుతారని విజ్ఞప్తి చేశారు. ముస్లింలు కూడా, ఎవరో ఏదో చేస్తారని ఎదురుచూడకుండా, తమకు కావలసింది, తమకు దక్కాల్సింది సాధించుకునే దిశగా సామాజిక చైతన్యంతో, నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రాతినిధ్య చట్టాల్లో తమ వాటా కోసం కార్యాచరణ రూపొందించుకోవాలని కోరారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక, మౌలిక హక్కుల సాధనకు, జనాభా ప్రాతిప్రదికన సామాజిక, రాజకీయ, ఆర్థిక, ప్రైవేట్, పబ్లిక్ జీవన రంగాలన్నిటిలో అందరితో పాటు ముస్లింల ప్రాతినిధ్యానికి ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాలని సూచించారు.

మైనారిటీ అత్యాచార నిరోధక చట్టం తీసుకురావాలని, ముస్లింల వ్యక్తిగత చట్టాల పరిరక్షణకు హామీ ఉండాలన్నారు. వక్ఫ్ ఆస్తులను రక్షించాలని కోరారు. ఉద్యోగ ఉపాధి రంగాలతోపాటు, జనాభా ప్రాతిపదికన రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని, హక్కులు సాధించుకోడానికి దేశంలోని విశాల హృదయులు, లౌకిక వాదులు, ప్రజాస్వామ్య ప్రేమికులు, హక్కుల నేతలు, బహుజను లతో కలిసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అసదుద్దీన్ ఓవైసీ పోరాటంలో మనమందరం పాలిబాగస్థులుగా కేవలం మైనార్టీల హక్కులు కాకుండా సమాజంలో ఎవరైతే హక్కుల ఉల్లాంగనకు గురైన బాధితులందరు ఏకంగా పోరాడితేనే హక్కులు మన హక్కులకు రక్షణ ఉంటుందని షేక్ రబ్బాని పిలుపునిచ్చారు.

# తక్షణమే దేశ ప్రజలకు అమీత్ షా క్షమాపణ చెప్పాలి

### క్షమాపణ చెప్పకుంటే దేశవ్యాప్త ఉద్యమం ప్రారంభిస్తాం : సమతా సైనిక్ దళ్ ముఖ్య నాయకుల డిమాండ్

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 18:** రాజ్యాంగబద్ధంగా హోం శాఖ మంత్రిగా ఎన్నికైన అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమానించడం అంటే యావత్ భారత్ జాతిని అవమానించడమేనని పేర్కొంటూ బుధవారం రోజు జహీరాబాద్ పట్టణములోగల అంబేద్కర్ భవనంలో సమతా సైనిక్ దళ్ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు.

ప్రపంచ మేధావి నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ప్రపంచం ఆయన చేసిన సంస్కరణాలను, చూపిన మార్గాలను అనుసరించి ముందుకెళ్తుంటే రాజ్యాంగబద్ధంగా కేంద్ర హోం శాఖ మంత్రిగా ఉన్న అమీత్ షా ఒక మతమౌఢ్యంతో బాబాసాహెబ్ అంబేద్కర్ ని విమర్శించడం అంటే ఈ దేశ బహుజన జాతులను విమర్శించడమేనని పేర్కొన్నారు. ఆయన వెంటనే పార్లమెంట్ సాక్షిగా ఈ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో స్వతంత్ర



ఉద్యమ నాయకులపై, రాజ్యాంగ నిర్మాతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అలాంటి వారిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని సమతా సైనిక్ దళ్ డిమాండ్ చేస్తుందని తెలిపారు. అమీత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని సమతా సైనిక్ దళ్ హెచ్చరిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బాలరాజ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కర్ణం రవికుమార్, శ్రీకాంత్, శేఖర్, అరుణ్ కుమార్, ప్రశాంత్, రాజు, బాలకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# డిడియస్ మండలస్థాయి జీవవైవిద్యం క్విజ్ పోటీలు





**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 18:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలో గల ఉన్నత పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులతో జహీరాబాద్ డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో బుధవారం జీవ వైవిద్యం అంశంపై క్విజ్ పోటీని నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో సిద్ధార్థ హై స్కూల్, జహీరాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలుర), జహీరాబాద్ జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలికల), శాంతి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాణిక్ ప్రభు హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. పాత పంటలు, చుట్టూ ఉన్న ప్రకృతి మరియు మరిచిపోతున్న పండగలను ముందు తరాలకు గుర్తు చేయాలనే ముఖ్య ఉద్దేశంతో డిడియస్ వారు ఈ పోటీలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పోటీలో సిద్ధార్థ హై స్కూల్ కు చెందిన కె. హర్షిత, వి. అమూల్య, యం. రిశ్వంత్ రెడ్డి, పి.అరుణ్ ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. జహీరాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.నందిని, బి.అశ్విని, కె.కావ్య శ్రీ, బి. ప్రశాంత్ రెండవ బహుమతిని గెలుచుకున్నారు. పోటిలో విజేతలుగా నిలిచినా విద్యార్థులు, విద్యార్థినులకు జహీరాబాద్ మండల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.



### చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ చైర్మన్ తన్వీర్

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 18:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలో గల ఖాన్‌జమాల్‌పూర్ గ్రామంలో న్యూ అపోస్తలిక్ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిజిఐడిసి మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చికి సంభందించిన మత పెద్దలు వారిని స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా తన్వీర్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఒకరిని ఒకరు గౌరవిస్తూ సమాజంలో సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బాబ్రాజ్, వివిధ సంఘాల పాస్టర్లు, సంఘ కాపరులు, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కుతుబుద్దీన్, మాజీ కౌన్సిలర్లు రాములు నేత, మోతిరామ్, నవీద్ తదితరులు హాజరయ్యారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన బిఆర్ఎస్ నాయకులు..

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 18:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం స్థానిక శాసన సభ్యులు కొనింటి మాణిక్ రావు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, పిఏసిఎస్ చైర్మన్ మచ్చెందర్‌లతో కలిసి లచ్చునాయక్ తండాకు చెందిన కావేరికి రూ.57,000=00 లు, సత్వార్ గ్రామానికి చెందిన రహీమా బీకి రూ.14,000/- ల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైనా చెక్కులను







లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు అందుకొన్న లబ్ధిదారులు ఎమ్మెల్యే మాణిక్ రావుకు, మండల బిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరు రాథోడ్, బిసి సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్, సత్వార్ గ్రామ బిఆర్ఎస్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సహీద్, నాయకులు మైనుద్దీన్ తదితరులు ఉన్నారు.



## మాజీ కౌన్సిలర్ దేవేందర్ రావు
# వర్ధంతి వేడుకలు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 18, వెలుతురు:** కూకట్ పల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ దివంగత నేత కురుమయ్య గారి దేవేందర్ రావు వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు , కుటుంబ సభ్యుల తో కలిసి దేవేందర్ రావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

## ప్రజలు తమ వంతు బాధ్యతగా పరిసరాల పరిశుభ్రతలో దృష్టి పెట్టాలి

### - కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి డిసెంబర్ 18 వెలుతురు:** ప్రజలు తమవంతు బాధ్యత వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్, రాంకి పెరల్ మధ్యలో ఉన్న నాలా వద్ద చెత్త పేరుకుపోయి దోమల సమస్య ఎక్కువగా ఉందని చుట్టుప్రక్కల ఉన్న కాలనీ ప్రజలు సమస్యను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సమస్యను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి నాలా వద్ద ఉన్న చెత్తను వెంటనే



శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా తమ వంతు బాధ్యత వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వారానికి ఒకసారైనా తనిఖీచేసుకుని మీ ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను తొలగించాలని అన్నారు. చెత్తను వీధుల్లో, కాలువల్లో, చెరువుల్లో వేయకుండా తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు
# అండగా బీఆర్ఎస్ పార్టీ

### - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి, డిసెంబర్ 18 వెలుతురు:** ఆటో కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్ కుమార్ అన్నారు. బుధవారం కూకట్ పల్లి లోని ఆటో స్టాండ్ లో ఆటో కార్మికులను కలసి వారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని, రేవంత్ రెడ్డి నిర్ణయాల వల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్ట పోతున్నారని





అన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ కచ్చితంగా పోరాడుతుందని ఈ సందర్భంగా కార్మికులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని ఖాకీ చొక్కా ధరించి తోటి ఎమ్మెల్యేలతో కలిసి ఆటోలో అసెంబ్లీకి వెళ్ళారు.



జిన్నారం మండలం సొలక్ పల్లి గ్రామంలో జంగారెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ మహోత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్న పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్

– జిన్నారం, వెలుతురు



### శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవంలో పాల్గొన్న

# "కాట శ్రీనివాస్ గౌడ్"

**పటాన్‌చెరు, వెలుతురు డిసెంబర్ 18:**
పటాన్ చెరు మండలం లక్డారం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం వేడుకలు ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేసి వారిని ఘనంగా సన్మానించారు.

### జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన

# కొల్చారం ఖోఖో జట్టు

**కొల్చారం, వెలుతురు న్యూస్ డిసెంబర్ 18:** సీఎం కప్ పోటీలలో భాగంగా జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో బుధవారం జిల్లాస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన ఖోఖో జట్టు ద్వితీయ స్థానం సాధించిందినట్లు కొల్చారం పిఈటి ప్రతాప్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి



స్థానం కోరకు తీవ్రంగా శ్రమించిన ఆటగాళ్లు తృతిలో మొదటి స్థానాన్ని చేజార్చుకుని, రెండవ స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయిలో రెండవ స్థానం సాధించిన ఆటగాళ్లను గ్రామస్తులు అభినందించారు. కాగా శివంపేట జట్టు మొదటి స్థానం సాధించారు. కార్యక్రమంలో పిఈటి ప్రతాప్ సింగ్ తో పాటు జట్టు కెప్టెన్ సుమంత్, వైస్ కెప్టెన్ రామకృష్ణ, ఇతర ఆటగాళ్లు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను పంపిణీ చేసిన కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్‌చెరు, వెలుతురు డిసెంబర్ 18:**
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో తామంతా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నామని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద బడుగు బలహీన



వర్గాల వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కష్టకాలంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది, అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న గుమ్మడిదల గ్రామానికి చెందిన వీరారెడ్డి, బచ్చుగూడ గ్రామానికి చెందిన కిష్టమ్మ లబ్ధిదారులకు జిన్నారం మండలం సొలక్ పల్లి గ్రామంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

# తెలంగాణ జన సమితి యాదాద్రి భువనగిరి జిల్లా ప్లీనరీనీ విజయవంతం చేద్దాం

### తెలంగాణ జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నకరకంటి అశోక్

**రామన్నపేట, వెలుతురు న్యూస్, డిసెంబర్ 18:**
ఈనెల 20వ తారీకు శుక్రవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కేంద్రంలో తెలంగాణ జన సమితి జిల్లా ప్లీనరీ సమావేశం జరుగుతున్నది, సమావేశానికి తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాసన మండలి సభ్యులు .ప్రొఫెసర్ కోదండరాం పాల్గొంటారు. పార్టీని అభివృద్ధి చేయుటకు దిశ నిర్దేశం చేస్తాడు. అదే విధంగా పౌర సమాజంతో ఉద్యమ కారులతో మాట ముచ్చట కార్యక్రమం ఉంటుంది. ప్రజా సమస్యలను పరిష్కరించుటకు పని చేస్తున్న పార్టీగా ప్రజలందరూ వచ్చి ప్లీనరీకి అందరికీ ఆహ్వానం అందిస్తున్నారని చెప్పారు. విజయవంతం చేయవలసిందిగా తెలంగాణ జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నకరకంటి అశోక్ తెలియజేశారు.



# దుప్పట్ల పంపిణి చేసిన మాతృదేవోభవ అనాధాశ్రమం

### పేదలకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు చేయడానికి సిద్ధంగా ఉంటాం : మాతృ దేవోభవ సంస్థ అధినేత గట్టు గిరి

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 18:**
సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగాం గ్రామంలో మాతృదేవోభవ అనాధ ఆశ్రమం నిర్వాహకులు గట్టు గిరి ఆధ్వర్యంలో 150 మంది వృద్ధులకు దుపట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలికాలంలో వృద్ధులు మానసిక వికలాంగులు ఇబ్బంది పడుతున్నారని విషయాన్ని గమనించి దుప్పట్లను ఇవ్వడం జరిగింది.

నిరుపేదలకు మాలాంటి సంస్థలు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఎలాంటి ఇబ్బందులు ఉన్న మాకు సమాచారాన్ని ఇస్తే సహాయానికి ముందుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం రవి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్,మాజీ ఎంపీటీసీ సభ్యులు బెల్లంకొండ శంకరయ్య,మాజీ సర్పంచ్ గడ్డం శంకరయ్య,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం



యాదయ్య,మాజీ వార్డు సభ్యులు మంచాల ఏసు,యువజన కాంగ్రెస్ మండల నాయకులు నాతి లక్ష్మణ్ గౌడ్, కానుగుల



వెంకటయ్య, బోద్రగోని శివ,బోద్రగోని అశోక్,బోద్రగోని రవి,తదితరులు పాల్గొన్నారు.

# అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు

- దావోస్ వెళ్లి అదానీతో రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్లు
- నీది నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం నిజమా?!
- వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేసి నిజాయితీ చాటుకో..
- రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు
- సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద సర్కస్ ఫీట్లు
- రేవంత్ రెడ్డిని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది
- అసెంబ్లీ బయట డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి
- కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారు
- సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదు
- ఎంబీబీఎస్ అడ్మిషన్లలలో తప్పుడు నియమాలు
- వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది
- మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ దే
- లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయి
- నేడు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటాను హైకోర్టు రద్దుచేసింది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు
- హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం..
- శాసనసభ ప్రవేశ మార్గంలో పేపర్లు లాక్కున్న పోలీసులు
- ఆటో డ్రైవర్లకు సంఘీభావం..
- ఖాకీ దుస్తుల్లో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

**హైదరాబాద్, డిసెంబర్ 18(వెలుతురు):**
సీఎం రేవంత్ రెడ్డి రోడ్ల మీద చేస్తున్న సర్కస్ ఫీట్లు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారు. మొదటి రోజు శాసనసభకు అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద నిరసనగా టీషర్ట్స్ వేసుకొని వస్తే అడ్డుకున్నారు. తమను సభా ప్రాంగణంలోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ రోజు రాజ్ భవన్ వద్ద అదానీ అవినీతి గురించి మాట్లాడినట్లు రేవంత్ సర్కస్ చేసిండు. అక్కడికి వెళ్లి కూడా కేసీఆర్ గురించి, బీఆర్ఎస్ గురించే మాట్లాడిండు తప్ప, అదానీ అవినీతి గురించి మాట్లాడింది తక్కువ. మీ పోరాటం అదానీ మీద అయితే మొదటి రోజు మమ్మల్ని ఎందుకు అసెంబ్లీ రాకుండా అడ్డుకున్నావు. నిరసన తెలిపే అవకాశం కూడా ఎందుకు ఇవ్వలేదు. మేము అడుగుతున్నా ఎందుకు అసెంబ్లీలో చర్చ పెట్టడం లేదు అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు.




దావోస్ వెళ్లి అదానీతో రూ.12,400 కోట్ల అగ్రిమెంట్లు చేసుకున్నవు. నీకు నిజంగా అదానీ అవినీతి మీద పోరాటం చేయాలనుకుంటే ముందు వెంటనే అగ్రిమెంట్లు రద్దు చేయ్. నీ మాటల్లో నిజాయితీ ఉంటే, వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు రూ. 12,400 కోట్ల అగ్రిమెంట్ రద్దు చేసుకోవాలి. అగ్రిమెంట్లు రద్దు చేసి నీ చిత్తశుద్ధిని నిరూపించుకో రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు సవాల్ చేశారు. రామన్నపేటలో డ్రైపోర్టు కోసం ల్యాండ్ ఇస్తే సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతి ఇచ్చావు. అదానీ కోసం పోలీసులను పెట్టి అరెస్టులు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశావు. పోలీసు పహారా మధ్య పబ్లిక్ హియరింగ్ చేశావు. అదానీకి ఏజెంట్‌గా కొమ్ముకాస్తున్నావు. ప్రజల కోరిక మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. డైవర్షన్



పాలిటిక్స్, సర్కస్ ఫీట్లు తప్ప ఇంకే లేదు. మీ డబుల్ స్టాండర్డ్‌కు నిదర్శనం మీ చిత్తశుద్ధి లేని పోరాటం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అదానీ దేశ పరువు తీసిండు అని రేవంత్ రాజ్ భవన్ వద్ద అన్నడు. మరి నువ్వు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకొని తెలంగాణ పరువు తీశావు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి రాష్ట్ర పరువు తీశావు. ఢిల్లీలో పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ పరువును తీశావు.

అదానీ, రేవంత్ అక్రమ సంబంధం మీద రేపు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. నీకు ఆ ధైర్యమే లేదు. అంతర్గతంగా ఒప్పందం మీకు ఉంది. సీఎం రాజ్ భవన్ వద్ద ట్రాఫిక్ జాం చేసిండు. ధర్నాలో పాల్గొన్న అందరి మీద నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కేసులు నమోదు చేయాలి. ధైర్యం ఉంటే, చట్టం అందరికి సమానం అయితే వారి మీద కేసులు పెట్టండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/ బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మెడికల్ అడ్మిషన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీస్తాయని మేము ఆనాడే చెప్పాం. ఈ రోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోట నియమాలను హైకోర్ట్ రద్దు చేసింది. ఎంబీబీఎస్ అడ్మిషన్ల ఆ తప్పుడు నియమాలతో జరిగినందు వలన వందల మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్లు కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్ల నిబంధనలు 2021లోని నిబంధన 8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148, 149లను కొట్టివేస్తూ మంగళవారం 106 పేజీల తీర్పును వెలువరించింది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతో పాటు వాటిని సవరించే అధికారం ఉందని, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేరొంది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని తేల్చి చెప్పింది. స్థానిక కోటాకు పీజీ మెడికల్, పీజీ (ఆయుష్) అడ్మిషన్లకు సంబంధించి 2021 పీజీ మెడికల్ అడ్మిషన్ల నిబంధన-8కి సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం అక్టోబరు 28న తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ దాదాపు 98 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సుదీర్ఘంగా విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస రావుతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది.

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించడంగానీ, రద్దు చేయడంగానీ చేయలేదని అందువల్ల అన్వయించుకున్నట్టు భావించాలని ధర్మాసనం పేరొంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 నేపథ్యంలో తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేసింది. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

మరోవైపు హరీశ్‌రావు పట్ల పోలీసులు అత్యుత్సాహం చూపించారు. శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు.శాసనసభ ప్రవేశ మార్గం వద్ద హరీశ్‌రావును ఆపిన డీఎస్పీ సుదర్శన్.. ఆయన తీసుకెళ్తున్న పేపర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. కారు తనిఖీ పేరుతో హరీశ్‌రావు తీసుకెళ్తున్న పేపర్లను లాక్కున్నారు. డీఎస్పీ సుదర్శన్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం దుర్మార్గమంటూ పోలీసులపై మండిపడ్డారు. ఈ ఘటనపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇంతలా ఎందుకు భయపడుతుందో అర్థం కావడం లేదని అన్నారు. ప్రజా పాలనలో కంచెలు తొలగించామని అంటూనే.. పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటున్నారని విమర్శించారు. శాసనసభ ప్రవేశమార్గంలో తనతో పోలీసులు వ్యవహరించిన తీరుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ఉన్న ప్లకార్డులను మండలిలోకి అనుమతించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల వద్ద ప్లకార్డులను పోలీసులు, మార్షల్స్ లాక్కుని.. వారిని లోపలికి పంపించారు. కాగా, ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఇవాళ బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ క్రమంలోనే కేటీఆర్, జగదీశ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్ రెడ్డి సహ ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి వచ్చారు. కాగా ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సమస్యలపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

# అదానీ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు

### గురివింద చందంగా కాంగ్రెస్ వ్యవహారం

### సిఎం ధర్నా చేయడం దారుణం: కిషన్ రెడ్డి

**హైదరాబాద్,డిసెంబర్18 (వెలుతురు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన మంత్రివర్గ సహచరులతో పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి హైదరాబాద్ రాజ్ భవన్ ముందు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారం గురివింద గింజ సామెతను తలపిస్తోందని.. అదానీ అంశంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. రూ.100 కోట్లు అదానీ కంపెనీ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ రూపంలో తీసుకుని ఒప్పందాలు తీసుకున్నారని.. ఎందుకోసం రూ. 100 కోట్ల సహాయం అడిగారో, ఎందుకు కలిసి ఫొటోలు దిగారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వందకోట్ల రూపాయలను స్కిల్ యూనివర్సిటీకి ఖర్చు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నప్పుడు గుర్తులేదా అంటూ ప్రశ్నించారు. వందకోట్ల సహాయం ఎందుకు అడిగారు? ఎందుకు ఇస్తామన్నారు?.. ఇవన్నీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని సవాల్ చేస్తున్నా.. రేవంత్ అయినా రాహుల్ గాంధీ అయినా.. ఏ ప్రాతిపదికన అదానీ మీద చర్యలు తీసుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. ఒక సాక్ష్యం చూపిస్తారా అంటూ సవాల్ విసిరారు. మన మీడియా ముందు, న్యాయ స్థానాల ముందు, ప్రజలముందు ఆధారాలు చూపించకుండా.. విమర్శలు చేయడం సరికాదన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో వరుసగా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న పార్టీ.. ఇవాళ ఫ్రస్టేషన్‌లో అదానీ మాట మాట్లాడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పొరపాటు చేసిందని,



కేంద్రం అవకతవకలకు పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ ఇవాళ నిరూపించగలదా అంటూ ప్రశ్నలు గుప్పించారు. మాటమీద నిలబడే సత్తాలేక.. ఇవాళ విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిగా సరైన పాలన లేదని.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి మీద విచారణ లేదని కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా అన్నిరకాల వైఫల్యంతో.. 12 ఏళ్లలో రావాల్సిన ప్రజావ్యతిరేకతను 12 నెలల్లోనే కూడగట్టుకున్నారన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం మీద, మోడీ మీద వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. రేవంత్ రెడ్డి ధర్నా చేయడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ వైపే ఉన్నారని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులేనంటూ కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతే.. మళ్లీ బీఆర్ఎస్ పార్టీయే రావాలని కాంగ్రెస్ అధిష్టానం.. రేవంత్ రెడ్డిని హెచ్చరించిందా అంటూ కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు.అందుకే రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ పాట పాడుతున్నాడా అంటూ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ బొమ్మ బొరుసు లాంటి వ్యక్తులు అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. దొందూ దొందే అని.. ఈ రెండు పార్టీల పాలనకు తేడా లేదని అన్నారు. ప్రజలను వంచించడంలో తెలంగాణ సంపదను దోచుకోవడంలో, కుటుంబ పరిపాలన తీసుకురావడంలో, కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి తేడా లేదని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో.. ఆ రెండు పార్టీల పనిచేసే తీరు ఒక్కటేనన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మూకుమ్మడిగా.. ప్రజాతీర్పును అగౌరవపరిచిన పార్టీలు నాడు బీఆర్ఎస్, నేడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పీఏసీ ఛైర్మన్‌గా, ఎంపీ అభ్యర్థిగా.. కాంగ్రెస్ నియమించడం కంటే బలమైన దోస్తీ ఉంటుందా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా కేసీఆర్ మారిస్తే.. రేవంత్ రెడ్డి మరింత దిగజారుస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఎవరు, ఎప్పుడు అప్పులిస్తరో తెలుసుకునేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసిన చరిత్ర రేవంత్ రెడ్డిదంటూ విమర్శింటారు.



## జన్మ భూమి రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం

### ఆర్థిక సాయం అందజేసిన మాతృదేవోభవ ఆశ్రమం గట్టు గిరి

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 18:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నూకం గాలయ్య లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమారుడు గత మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో విషయాన్ని తెలుసుకున్న మాతృదేవోభవ అనాధాశ్రమ నిర్వాహకులు గట్టు గిరి వెంటనే స్పందించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి సహకరంగా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మ భూమి రుణం తీర్చుకోవడం కోసం నా పరిధి మేరకు ఎల్లవేళలా సహాయ సహకారాలు చేస్తూనే ఉంటా అన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న మాకు సంప్రదించగలరని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతల సత్యనారాయణ, ఉప్పారమోని పెద్ద యాదయ్య, ఉప్పారమోని చిరంజీవి,చింతల బుగ్గయ్య,చెక్క కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## సమగ్ర శిక్ష అభియన్ ఉద్యోగుల రిలే నిరహార దీక్షలు

**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు డిసెంబర్ 18:** సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల గత కొన్ని రోజుకుగా వారి విధులను బహిష్కరించి రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమగ్ర శిక్ష అభియన్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకుడు సికిలామెట్ల శ్రవణ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్



ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి అని రెగ్యులరైజ్ చేసేంత వరకు తక్షణంగా మినిమం టైం స్కేల్ చేయాలి. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా 10 లక్షలు, ఆరోగ్య బీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలి అనే డిమాండ్ల పై ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచాల దశరథ ,నరసింహ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## సర్వేల్ గురుకుల విద్యార్థికి గాయం

### శరీరంపై వేడి వేడి జావా పడి కాలిన కాళ్లు

### నిర్లక్ష్యానికి బాధ్యలుగా ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలి.

**సంస్థాన్ నారాయణపురం, వెలుతురు డిసెంబర్ 18:** ఇటీవలే ఘనంగా నూతన గురుకుల భవనాన్ని మునుగోడు ఎమ్మెల్యే రాజగోల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు సందర్శించిన రెండు రోజుల కే సర్వేల్ గురుకుల పాఠశాలలో వంట శాలలో నిర్లక్ష్యం కారణంగా ఒక



విద్యార్థికి కాళ్లు కాలడం జరిగింది. వంట మనుషులు లేక 8 తరగతి విద్యార్థితో పని చేయించడం వల్ల వేడి వేడి జావా శరీరం పైన పడి గాయాల పాలయ్యాడు. ఈ ప్రభుత్వం తీరు పేరు గొప్ప,ఊరు దిబ్బ అన్న చందాన ఉంది. ఈ నిర్లక్ష్యానికి తెలంగాణ ప్రభుత్వం ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేసి,ఆ విద్యార్థికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని వివిధ రాజకీయ నాయకులు డిమాండ్ చేశారు.

## తెలంగాణ జన సమితి పార్టీ మండల అధ్యక్షునిగా గడ్డం యాదగిరి నియామకం



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 18:** ఇటీవల తెలంగాణ జన సమితి పార్టీలో చేరిన గడ్డం యాదగిరికి నమ్మకంతో పార్టీని పటిష్ట పరుస్తాడని జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్ మండల అధ్యక్షునిగా నియమించాడు. చేపట్టిన టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాంకి కృతజ్ఞతలు అదేవిధంగా నియమిచ్చినటు వంటి జిల్లా అధ్యక్షునికి కృతజ్ఞతలు జిల్లా ఉపాధ్యక్షుడు నకరికంటి అశోక్ పార్టీ పెద్దలందరికీ హృదయపూర్వక నమస్కారాలు నేను పార్టీకి ఎల్లకాలం కష్టపడి పార్టీ సైనికునిగా పనిచేస్తానని పార్టీ ఆదేశాన్ని పాటిస్తానని, నాయకులకు కృతజ్ఞతలు అదే విధంగా ఈనెల 20న యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్లీనరీ చౌటుప్పల్‌లో సమావేశం జరుగుతున్నది, సమావేశానికి పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హాజరై పార్టీ యొక్క దశ నిర్దేశం చేస్తారు. అదేవిధంగా ఉద్యమకారులతో ప్రజానీకంతో మాట ముచ్చట ఉంటుంది. ఈనెల 20న జరిగే సమావేశం ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయగలరని కోరుతున్నా.

## సూర్యాపేట జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలి!

**సూర్యాపేట జిల్లా వెలుతురు డిసెంబర్ 18:** సూర్యాపేట జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన కోదాడలోని సెయింట్ జోసెఫ్ సిసిఆర్ ఉన్నత పాఠశాలలో జరుగుతుందని జరుగుతున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార మరియు పౌరసరఫరాల శాఖామాత్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు విశిష్ట అతిథిగా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కోపరేటివ్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ శాఖామాత్యులు మరియు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మరియు కోదాడ శాసనసభ్యులు నలమాద పద్మావతి రెడ్డి, గౌరవ అతిథులుగా నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మరియు ప్రత్యేక ఆహ్వానితులుగా కోదాడ మున్సిపల్ చైర్పర్సన్ సామినేని ప్రమీల, కోదాడ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షేమ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ హాజరవు



తున్నారని సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్ గారు ఒక ప్రకటనలో తెలియజేసారు.

ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన చైర్మన్ గా శ్రీ తేజస్ నందలాల్ పవర్ గారిని ఈ కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.అశోక్ గారు మరియు ఆహ్వాన కమిటీ కన్వీనర్ జెల్లా ప్రసాద్ మరియు సూర్యాపేట మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస గౌడ్ గారు మరియు కో-కన్వీనర్లు ధరావత్ మోతిలాల్ నాయక్,కస్తూరి కిషన్ ప్రసాద్, యామా రమేష్, గులాం జహంగీర్,లక్కపాక ప్రవీణ్ గార్లు ఆహ్వానించారు.

## ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ సుధీర్ బాబు

**వెలుతురు, ఎల్ బి నగర్, డిసెంబర్ 18:** ఎల్ బి నగర్ పోలీస్ స్టేషన్ ను రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు బుధ వారం ఆకస్మికంగా సందర్శించారు, ఈ సందర్భంగా సీపీ సుధీర్ బాబు సిబ్బందితో మాట్లాడారు, పోలీస్ స్టేషన్ కు వచ్చే వారికి పౌర సేవలను అందించడానికి తీసుకొని చర్యలను అడిగి తెలుసుకున్నారు, అలాగే పోలీస్ స్టేషన్ కు వచ్చే మహిళలకు ప్రాధాన్యత ను ఇవ్వాలని సిబ్బంది కి సూచించారు, పోలీస్ స్టేషన్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఏసీపీ కృష్ణయ్య లతో కలిసి స్టేషన్ కు సంబంధించిన అన్ని రకాల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు, పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## తెలుగోడి సాహిత్య సేవకు పట్టం..

### అభ్యుదయ కవి లక్ష్మీ నారాయణ అత్యున్నత పురస్కారం

### కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్‌ను గెలుచుకున్న కవి

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18((వెలుతురు):** కేంద్ర ప్రభుతం ఉత్తమ సాహిత్యాన్ని అందించే సృజనాత్మక సాహిత్యవేత్తలకు ప్రతి సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందజేస్తుంది. భారతీయ సాహిత్య పురస్కారాల్లో అత్యున్నతమైన పురస్కారంగా ప్రసిద్ధిగాంచిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ 2024 సంవత్సరానికి గాను పలు భాషలకు చెందిన సాహితీ వేత్తల కథలు, కవితలు, సంపుటాలకు ఈ అత్యుత్తమ పురష్కారం అందుకోనున్నారు. తెలుగు భాషలో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరుకి చెందిన ప్రముఖ కవి, న్యాయవాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ కోసం ఎంపికయ్యారు. లక్ష్మీ నారాయణ వృత్తి రీత్యా న్యాయవాది. అంతేకాదు ఆయన అభ్యుదయ కవి. శ్రామిక పక్షపాతిగా పేరు గాంచారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శిగాను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగాను పనిచేస్తున్నారు. 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు.



వివిధ విమర్శనా గ్రంథాలను, సాహిత్యవ్యాసాల సంపుటి , కవిత్వాన్ని రచించారు. ఇప్పటికే ఆయన తెలుగు భాషాపురస్కారం, సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం, మిలీనియం లాయర్ పురస్కారం లను అందుకున్నారు. లక్ష్మీ నారాయణ 1954, అక్టోబర్ 24వ తేదీన గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు జన్మించారు. మధ్యతరగతి కుటుంబం.. తండ్రి ఓ సామాన్య రైతు.. బిఎ డిగ్రీ చదివిన తర్వాత బీఎల్ చేశారు. గుంటూరులో న్యాయవాద వృత్తిని చేపట్టారు. భార్య పేరు గీత, టీచర్ గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 21 భాషలకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను సాహిత్య అకాడమీ ప్రకటించింది. బెంగాలీ, ఉర్దూ, డోగ్రి భాషలకు సంబందించిన అవార్డులను త్వరలో ప్రకటించనున్నారు. పురష్కరాలకు ఎంపికయిన రచయితలకు వచ్చే సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో ఈ పురష్కరాలను అందజేయనుంది. శాలువా తో సన్మానం చేసి ఆ అవార్డు కింద లక్ష రూపాయల నగదును బహుమతిగా అందజేయనున్నారు. ఈ అవార్డ్ కోసం తెలుగు బాష నుంచి మొత్తం 14 పుస్తకాలను సిఫార్స్ చేసినట్లు.. అందులో దీపిక' అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటిక ఎంపికఅయినట్లు తెలుస్తోంది.



## అదానీకి రేవంత్ రెడ్డి ఏజెంట్

- అదానీతో 12,400 కోట్ల ఒప్పందాలు రద్దు చేసుకోవాలి
- రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి రేవంత్ అనుమతులు
- కాంగ్రెస్ నేతలపై సీపీ సీవీ ఆనంద్ కేసులు పెట్టాలి.
- అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి .హరీష్ రావు

**హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు)** రేవంత్ రెడ్డి సర్కస్ ఫీట్లు చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుంది. ఢిల్లీలో దోస్తీ,గల్లీలో కుస్తీ చేస్తున్నారు. రాజ్ భవన్ ముట్టడిలో కేసీఆర్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. మేము రేవంత్ రెడ్డి,ఆదానీ ఫోటోతో అసెంబ్లీకి వస్తే మమమ్మల్ని అడ్డుకున్నారు. అదానీతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం 12 వేల కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి.

అదానీపై రేవంత్ రెడ్డి పోరాటం నిజమైతే, ఒప్పందాలు ఎందుకు రద్దు చేసుకోవడం లేదు అదానీకి వంద కోట్లు వాపస్ ఇచ్చినట్లు 12,400 కోట్ల ఒప్పందాలు రద్దు చేసుకోవాలి. రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి రేవంత్ అనుమతులు ఇస్తున్నారు. అదానీకి రేవంత్ రెడ్డి కొమ్ముకాస్తున్నారు. రోడ్డుపై రేవంత్ రెడ్డి సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి అదానీకి ఏజెంట్ లా పని చేస్తున్నారు.

అదానీకి రెడ్ కార్పెట్ వేసి తెలంగాణ పరవును, రాహుల్ గాంధీ పరువును రేవంత్ రెడ్డి మంట కలిపారు. రేపు అసెంబ్లీలో అదానీ,రేవంత్ రెడ్డి సంబందంపై చర్చ పెట్టాలి. రాజ్ భవన్ ముట్టడిలో అదానీ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. రేవంత్ రెడ్డి పార్టీ తిడితే 100 కోట్లు అదానీకి వాపస్ ఇచ్చారు. చట్టం అందరికీ సమానం అయితే కాంగ్రెస్ నేతలపై సీపీ సీవీ ఆనంద్ కేసులు పెట్టాలి.

## లగచర్ల దాడి కేసులో ఊరట

### నిందితులకు బెయిల్ మంజూరు

**హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు):** లగచర్లలో అధికారులపై దాడి కేసులో నిందితులందరికీ నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం బెయిల్‌ను మంజూరు చేసింది. పట్నం నరేందర్ రెడ్డితో పాటు సురేష్, మిగతా నిందితులు అందరికీ బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పట్నం నరేందర్ రెడ్డి రెండు 50 వేల ష్యూరిటీలు, మిగతా వారు 20 వేల పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

మూడు నెలల పాటు ప్రతి బుధవారం పోలీసుల ముందు విచారణ హాజరుకావాలని పట్నం నరేందర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీ స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , ఇతర రెవెన్యూ అధికారులపై స్థానికుల దాడి జరిగింది. ఈ దాడిలో అధికారులు ప్రయాణిస్తున్న వాహనాలను రాళ్లతో ధ్వంసం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన అధికారులపై దాడి జరగడంతో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. కాంగ్రెస్ పార్టీ ఈ ఘటన వెనుక బీఆర్ఎస్ పార్టీ హస్తం ఉందని ఆరోపించింది. స్థానికులను రెచ్చగొట్టి అధికారులపై దాడి చేయించారని కాంగ్రెస్ విమర్శలు చేసింది. బీఆర్ఎస్ నేతల ఆదేశాల మేరకు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తన అనుచరుడు భోగమోని సురేష్‌తో కలిసి ఈ దాడి ఎలాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## లైంగిక వేధింపుల కేసు

### యూట్యూబర్ ప్రసాద్ బెహరా అరెస్ట్

**హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు):** లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ యూట్యూబర్ ప్రసాద్ బెహరా ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఓ వెబ్ సిరీస్ షూటింగ్ సమయంలో హీరోయిన్‌తో అసభ్యంగా ప్రవర్తించాడనే ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేశారు. షూటింగ్ సమయంలో తనను అందరి ముందు పలుమార్లు అసభ్య పదజాలంతో దూషించాడని, అలాగే ప్రైవేటు భాగాలను తాకాడని, చెప్పలేని పదాలతో అవమానించాడని జూబ్లీహిల్స్ పోలీసులకు బాధిత యువతి ఫిర్యాదు చేసింది.

ఈ మేరకు ప్రసాద్ బెహరాపై పలు సెక్షన్స్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మా విడాకులు, పెళ్లి వారమండి, మెకానిక్ వెబ్ సిరీస్‌లతో నిందితుడు ప్రసాద్ బెహరా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల రిలీజైన కమిటీ కుర్రాళ్లు సినిమాతోనూ నటుడిగా మంచి గుర్తింపే వచ్చింది. కాగా, లైంగిక వేధింపుల కేసులో ప్రసాద్ అరెస్ట్ కావడంతో తెలుగు సినిమా ఇండస్ట్రీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.




## మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళకు చనిపోయిన భర్త ఆస్తిలో వాటా

### మద్రాసు హైకోర్టు సంచలన తీర్పు

మద్రాసు,డిసెంబర్ 18((వెలుతురు): భర్త మరణించిన తర్వాత మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళకు చనిపోయిన తన భాగస్వామి ఆస్తిలో వాటా ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహ చట్టం కింద మరణించిన తన భర్త ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరాకరించే నిబంధనేదీ లేదని ఓ కేసు విషయంలో వ్యాఖ్యానించింది. తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన మల్లిక అనే మహిళ భర్త చిన్నయ్యన్ కొంత కాలం క్రితం మరణించారు. ఆ తర్వాత ఆమె మళ్లీ పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమెకు చనిపోయిన తన భర్త ఆస్తిలో వాటా ఇచ్చేందుకు చిన్నయ్యన్ కుటుంబసభ్యులు నిరాకరించారు. ఆ విషయంలో మల్లిక సేలం జిల్లా కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆమెకు నిరాశ ఎదురైంది. దివంగత భర్త ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరోధించడానికి ఆమె పునర్వివాహం ఒక కారణమని పేర్కొంది జిల్లా కోర్టు.ఆ తర్వాత దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు మల్లిక. విచారణకు స్వీకరించిన హైకోర్టు, దిగువ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. హిందూ వివాహ చట్టం- మహిళ పునర్వివాహం చేసుకున్నా, మరణించిన ఆమె భర్త ఆస్తిని వారసత్వంగా పొందే హక్కును కల్పిస్తుందని తెలిపింది. మళ్లీ వివాహం చేసుకున్నారనే సాకుతో ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరాకరించే నిబంధన ఏదీ లేదని కోర్టు చెప్పింది. అలాంటి నిబంధన 2005లో రద్దు అయిందని గుర్తు చేసింది. వారసత్వంలో సమానత్వం పాటించాలనే సూత్రాన్ని హైకోర్టు సమర్థించింది. ఆస్తి విషయంలో మహిళలకు సమాన హక్కులు ఉంటాయని గుర్తు చేసింది.

## రూ. 22,280 కోట్ల విలువైన మాల్యా, చోక్సీ ప్రాపర్టీలు సీజ్ : నిర్మలాసీతారామన్

న్యూఢిల్లీ,డిసెంబర్ 18 (వెలుతురు): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణలో భాగంగా అనేక కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను సీజ్ చేసి అటాచ్ చేసింది. ఆర్థిక నేరాలకు లింకున్న ఆ ప్రాపర్టీలను స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి సీతారామన్ బదులిస్తూ.. విజయవంతంగా ఈడీ సుమారు 22,280



కోట్ల విలువైన ప్రాపర్టీలను సీజ్ చేసినట్లు చెప్పారు. దీంట్లో విజయ్ మాల్యాకు చెందిన 14,131.6 కోట్లు ఆస్తి ఉన్నట్లు తెలిపారు. ఇక నీరవ్ మోదీ కేసులో 1,052.5 కోట్ల ఆస్తుల్ని బ్యాంకులు జప్తు చేసుకున్నట్లు చెప్పారు. నేషనల్ స్పాట్ ఎక్స్‌చేంజ్ స్కామ్‌లో 17.47 కోట్లు బ్యాంకులు సీజ్ చేశాయన్నారు. ఎస్‌ఆర్‌ఎస్ గ్రూపుకు చెందిన 20.15 కోట్లు, రోజ్ వాలీ గ్రూపుకు చెందిన 19.40 కోట్లు, సూర్య ఫార్మసీకి చెందిన 185.13 కోట్లు, నౌషేరా షేక్ గ్రూపుకు చెందిన 226 కోట్లు, నాయుడు అమృతేశ్ రెడ్డికి చెందిన 12.73 కోట్ల ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నాయి. మోహుల్ చోక్సీకి చెందిన 2,565.90 కోట్ల విలువైన ప్రాపర్టీలను బ్యాంకులు స్వాధీనం చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

## అసెంబ్లీ ముందు డ్రంకన్‌డ్రైవ్ టెస్టులు పెట్టాలి : హరీశ్‌రావు

హైదరాబాద్,డిసెంబర్ 18 (వెలుతురు): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు



నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు.

## శాంతిభద్రతల సమస్య సృష్టించేలా బిఆర్ఎస్: బల్మూరి

హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు): కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే శాంతిభద్రతల సమస్య సృష్టించాలని బీఆర్‌ఎస్ నాయకులను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందన్నారు. అందుకే అరెస్ట్ చేస్తారని.. .జైలు కెళ్తానని కలవరిస్తున్నాడని తెలిపారు. అక్రమాలకు పాల్పడితే కేటీఆర్‌పై చట్టపరంగా ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఏ తప్పు చేయకపోతే పదేపదే జైలుకు వెళ్తానని ఎందుకు అంటున్నారు? తప్పు చేసినట్లు తేలితే కటకటాల పాలవుతారు. ముందు మాజీ సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలి. అసెంబ్లీ చర్చలో పాల్గొనాలని బల్మూరి అన్నారు.

## భారత్,అమెరికాలది బలమైన బంధం

### అధ్యక్షుడు బైడెన్ బృందం వ్యాఖ్యలు

### భారత్ పన్నుల భారంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు




వాషింగ్టన్,డిసెంబర్18(వెలుతురు): అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్.. మరోసారి భారత్ 'సుంకాల' అంశాన్ని ప్రస్తావిస్తూ.. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అమెరికా ఉత్పత్తులపై న్యూదిల్లీ అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తోందని ఆరోపించారు. దీనికి ప్రతీకార పన్ను తప్పదంటూ మళ్లీ హెచ్చరికలు చేశారు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలాఉండగా.. భారత్, అమెరికా సంబంధాలపై ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగం కీలక వ్యాఖ్యలు చేసింది. బైడెన్ పాలనలో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడిందని పేర్కొంది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా దీన్ని కొనసాగించాలని ఆశాభావం వ్యక్తంచేసింది. భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రాతో భేటీ సందర్భంగా అమెరికా విదేశాంగశాఖ డిప్యూటీ సెక్రటరీ కర్ట్ కాంప్‌బెల్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా ఉత్పత్తులపై భారత్, బ్రెజిల్ వంటి దేశాలు అత్యధిక టారిఫ్‌లు విధిస్తున్నాయి. 100, 200శాతం పన్నులు వేస్తున్నాయి. దేనికైనా ప్రతిచర్య ఉంటుంది. వాళ్లు మాపై పన్నులు విధిస్తే మేమూ అంతేస్థాయిలో పన్నులు వసూలు చేస్తాం. ఒకవేళ భారత్ 100శాతం పన్నులు విధిస్తే మేము వారిపై అలాగే ఛార్జ్ చేయకూడదా ఆయా దేశాలు సుంకాలు వసూలు చేయడం అనేది వారి ఇష్టమే. కానీ, మేం కూడా అలాగే స్పందిస్తాం' అని ట్రంప్ వివరించారు. అధ్యక్ష ఎన్నికలకు ముందు కూడా ట్రంప్ పలుమార్లు సుంకాల అంశంపై ఇదేతరహా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తానని గతంలోనూ హెచ్చరించారు. తాజా వ్యాఖ్యలతో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత దీనిపై ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది. 2019లో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో భారత్‌ను ఆయన 'టారిఫ్ కింగ్' అని పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్‌కు జీఎస్‌పీని రద్దు చేశారు. ఈ హోదా వల్ల భారత మార్కెట్లలోకి సమాన, హేతుబద్ధ సంధానత లభించలేదని ఆయన అప్పట్లో ఆరోపించారు. జీఎస్‌పీ (జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్) కింద అమెరికాకు అర్హత గల అభివృద్ధి చెందుతున్న దేశాలు సుంకం రహిత ఎగుమతులు చేయడానికి వీలుంటుంది. అయితే ఈ హోదాను పునరుద్ధరించేందుకు ఇరుదేశాల మధ్య కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి.

## మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు

### పదేళ్ల పాలనలో ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలే

### బ్యాంకుల ముందు మోకరిల్లుతున్న సీఎం రేవంత్ : ఎమ్మెల్సీ కవిత




హైదరాబాద్, డిసెంబర్ 18 (వెలుతురు): మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పదేండ్లలో బీఆర్‌ఎస్ హయాంలో రుణం కోసం ఏనాడూ ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రపంచ బ్యాంకు ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. ఈ మేరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై కల్వకుంట్ల కవిత కీలక విషయాలను బయటపెట్టారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబర్ 19వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిందని అన్నారు. ఆ ప్రతిపాదనల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసి ఉందని తెలిపారు. కానీ మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వం తప్పుడు సమాధానాలు చెబుతోందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో రుణం కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకు ముందు రేవంత్ రెడ్డి మోకరిల్లుతున్నారని ధ్వజమెత్తారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని స్పష్టం చేశారు.

"ప్రపంచ బ్యాంకుకు కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 19న ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ప్రతిపాదనల్లో స్పష్టంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు అని స్పష్టం రాసుంది. కానీ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని తప్పుడు విషయం చెప్పారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ పూలింగ్ చేసి పెద్ద పెద్ద భవంతులు కడుతామని ప్రతిపాదనల్లో స్పష్టంగా పేర్కొంది. డీపీఆర్ లు ఉన్నాయని ప్రపంచ బ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. కానీ ప్రభుత్వం మాత్రం శాసన మండలిలో డీపీఆర్ లు లేవని చెప్పింది. డీపీఆర్ తయారు కాలేదని డిసెంబరు 17న చెప్పిన ప్రభుత్వం డీపీఆర్ ఉందని ప్రపంచ బ్యాంకుకు సెప్టెంబరు 19న తెలియజేసింది. అంతే కాకుండా, ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు పంపిన తర్వాత అక్టోబరులో డీపీఆర్ తయారీకి కాన్సార్షియంను ప్రభుత్వం నియమించింది." అని వెల్లడించారు.

## ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో అసెంబ్లీలో చర్చకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



హైదరాబాద్, డిసెంబర్ 18 (వెలుతురు): ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో అసెంబ్లీలో చర్చకు అనుమతి ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ లేఖ రాశారు. గత కొద్ది రోజులుగా ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొద్దినెలలుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుపై అనేక నిరాధార ఆరోపణలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఈ వారం జరిగిన కేబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ జరిగినట్లుగా వార్తలు వచ్చాయని.. గవర్నర్ ఆమోదం వచ్చిందంటూ సీఎం కార్యాలయం నుంచి రకరకాల లీకులు మీడియాకు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చ కన్నా శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలేంటో అందరికీ తెలుస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా- ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకుందని.. ఈ రేస్తో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల లబ్ధి చేకూరినట్లుగా నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసిందని పేర్కొన్నారు. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసిందని ఆరోపించారు. అప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగిందని.. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని కేటీఆర్ వివరించారని తెలిపారు. అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు నిజా లేమిటో తెలుసుకునే హక్కు ఉందని.. శాసనసభలో ఈ అంశంపై చర్చకు అనుమతించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదామని.. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున అనుకూలమైన రోజే చర్చ పెట్టాలని కోరుతున్నామన్నారు. ఈ అంశంపై శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయన్నారు.

## పంజాబీ రైతుల రైల్ రోకో

చండీఘడ్, డిసెంబర్ 18 (వెలుతురు): పంజాబీ రైతులు రైల్ రోకో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఛలో ఢిల్లీ ప్రయత్నం విఫలం కావడంతో.. ఆ రైతులు ఇప్పుడు రైళ్లను ఆపేస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు రైళ్లను నిలిపివేశారు. రాష్ట్రంలోని అనేక మార్గాల్లో మూడు గంటల పాటు రైల్ రోకో నిర్వహించారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. సంయుక్త కిసాన్ మోర్చాతో పాటు కిసాన్ మజ్దూర్ మోర్చాలు రైల్ రోకో నినాదాన్ని ఇచ్చాయి. రైల్వే ట్రాకులపై రైతులు బైఠాయించినట్లు కిసాన్ మజ్దూర్ మోర్చా నేత సర్వాన్ సింగ్ పందేర్ తెలిపారు. ఢిల్లీ మార్చును అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13వ తేదీ నుంచి శంభూ, కన్నౌరి బోర్డర్ల మధ్య రైతులు ధర్నా చేపడుతున్న విషయం తెలిసిందే. కన్నౌరు బోర్డర్ పాయింట్ వద్ద పంజాబీ రైతు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ దీక్ష చేపడు తున్నారు. పంటలకు ఎంఎస్పీ ఇవ్వాలని కేంద్రాన్ని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



101 మంది రైతులు డిసెంబర్ 6,8, 14వ తేదీల్లో ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలను హర్యానా భద్రతా దళాలు అడ్డుకున్నాయి. పంటలకు ఎంఎస్పీతో పాటు రుణమాఫీ, పెన్షన్, విద్యుత్తు ధరల తగ్గింపు, పోలీసు కేసులు ఎత్తివేత లాంటి డిమాండ్లపై రైతులు పోరాడుతున్నారు.

## 28న ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం

### మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలసి కిషన్ రెడ్డి రాక

### రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాల కల్పన

హైదరాబాద్,డిసెంబర్18(వెలుతురు): ఆధునీకరించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈనెల 28న రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. దీంతో ఇది మహా నగరం సిగలో మరో మణిహారం కానుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సుమారు రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ స్టేషన్ భవనంలో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టులు, ఆరు బుకింగ్ కౌంటర్లు, పురుషులు, మహిళలకు వేర్వేరు వెయిటింగ్ హాళ్లు, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఉంది. మొదటి అంతస్తులో కెఫెటేరియా, రెస్టారెంట్, రెస్ట్‌రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కొత్త డిజైన్‌లో ప్రయాణికుల రాకపోకలకు విశాలమైన స్థలం (కాన్కోర్స్), ముందువైపు ప్రకాశవంతమైన లైటింగ్‌తో ఆధునిక ఎలివేషన్‌ను తీర్చిదిద్దారు. ప్రయాణికులకు ఉచిత వై సదుపాయం కల్పించను న్నారు. హైదరాబాద్ శివారులోని ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక.. పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. తద్వారా జంటనగరాల్లోని ప్రధాన రైల్వే



స్టేషన్లపై ఒత్తిడి తగ్గించాలనేది రైల్వే శాఖ లక్ష్యం. ఈ టెర్మినల్ అందుబాటులోకి వచ్చాక నగరంలోని నాంపల్లి, కాచికూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లపై ప్రయాణికుల ఒత్తిడి గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడి నుంచే నగరం నలుమూలలకు ప్రయాణికులు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనంగా కొత్తగా మరో 25 జతల రైళ్లు ఇక్కడి నుంచి పరుగుల తీయనున్నాయి. లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగించనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజారవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది.



# అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

## పార్లమెంట్ ఆవరణ ముందు అంబేడ్కర్ చిత్రాలతో నిరసన

**న్యూఢిల్లీ,డిసెంబర్18(వెలుతురు):** కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హోం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు ఆశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘపరివార్ భావిస్తోందని అన్నారు. 'నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి' ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు.

మంగళవారం రాజ్యసభలో చర్చ నేపథ్యంలో అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. హోంమంత్రి వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంబేద్కర్ చిత్రాలు ప్రదర్శిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపీలు నిరసన తెలిపారు. అలాగే అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేశాయి. ఆ నిరసనల్లో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు.

# సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన స్పీడ్ బోటు

## పలువురు పర్యాటకుల గల్లంతు

## ప్రమాద సమయంలో పడవలో 66 మంది ప్రయాణికులు

## 21మందిని రక్షించిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది

**ముంబై,డిసెంబర్ 18((వెలుతురు):** దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా సమీపంలోని సముద్రంలో ప్రయాణికులతో నిండిన పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో బోటులో ఉన్న ప్రయాణికులంతా నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు మరో బోటులో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బోటులో 60 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం



వారిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కొంత మందిని రక్షించారు. ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ పడవ గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా వైపు వెళుతోంది. బుధవారం(డిసెంబర్ 18) మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ సమయంలో అస్పష్టమైన వాతావరణం కారణంగా, పెద్ద సంఖ్యలో పర్యాటకులు గేట్‌వే ఆఫ్ ఇండియాకు చేరుకున్నారు. వీరిలో చాలా మంది బోటింగ్‌కు కూడా సముద్రంలోకి వెళ్లారు. కొందరు పర్యాటకులు స్పీడ్ బోటులో ఎలిఫెంటా వైపు వెళు న్నారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. వారి పడవ ఒడ్డు నుంచి 50 మీటర్ల లోపలికి వెళ్లగానే ఒక్కసారిగా ఏదో జరిగి మునిగిపోవడం ప్రారంభించింది. యాదృచ్ఛికంగా, ఒక పెద్ద పడవ అక్కడికి చేరుకుంది. మునిగిపోతున్న పడవ నుండి కొంతమంది ప్రయాణికులను పెద్ద పడవలోకి తీసుకువెళ్లారు. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సమాచారం అందుకున్న వెంటనే, అనేక ఇతర బోట్లతో సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాదంలో ఒకరి మృతి చెందగా, 21 మందిని కోస్ట్‌గార్డ్ రక్షించింది. మిగిలి ప్రయాణీకులను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాద సమయంలో పడవలో 66 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, బోటులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు అధికారులు గల్లంతైన వారి ఆచూకీ కోసం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం డైవర్ల బృందాన్ని సముద్రంలోకి దింపారు.

# విద్యార్థులకు జరిగిన నష్టానికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే : హరీశ్‌రావు

**హైదరాబాద్, డిసెంబర్ 18 (వెలుతురు):** తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్‌ఎంఎస్/బీఏఎంఎస్ చేసిన వారికి స్థానిక కోటా పరిధిలోనే పీజీ కోర్సుల్లో అడ్మిషన్‌లు కల్పించాల్సి ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పడంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు స్పందించారు. మెడికల్ అడ్మిషన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం లోకల్ కోటా నిబంధనలు స్థానికుల అవకాశాలను దెబ్బతీస్తాయని తాము ఆనాడే చెప్పామని గుర్తుచేశారు. ఈరోజు కాంగ్రెస్ తెచ్చిన లోకల్ కోటా నియమాలను హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు. ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఆ తప్పుడు నియమాలతో జరిగినందువల్ల వందలాది మంది స్థానిక అభ్యర్థులకు నష్టం జరిగిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టానికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన స్పష్టం చేశారు.

# రాజస్తాన్‌లో మందుగుండు పేలుడు

## - ఇద్దరు జవాన్లు మృతి

**జైపూర్,డిసెంబర్ 18 (వెలుతురు):** రాజస్థాన్ బికనీర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మందగుండు పేలడంతో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ నార్త్ క్యాంప్ ఆర్టిలరీ ప్రాక్టీస్ సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నది. ఈ పేలుడులో ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే సూరత్‌గఢ్‌లోని మిలటరీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సైనిక విన్యాసాల జరుగుతున్న ఫైరింగ్ రేంజ్‌లోని చార్లీ సెంటర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న సైనికాధికారులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మహాజన్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ కశ్యప్ సింగ్ ప్రమాదాన్ని ధ్రువీకరించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో ఆర్మీ ప్రాక్టీస్ కొనసాగుతోందని కశ్యప్ సింగ్ తెలిపారు. ట్యాంక్‌లోకి మందుగుండును ఎక్కిస్తున్న సమయంలో పేలుడు చోటు చేసుకున్నది. మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో వారం వ్యవధిలో సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఇది రెండో ఘటన. ఈ నెల 15న ట్రైనింగ్ సమయంలో ఓ సైనికుడు వీరమణం పొందాడు. చంద్ర ప్రకాష్ పటేల్ టోయింగ్ వాహనానికి తుపాకీని అటాచ్ చేస్తున్నప్పుడు, తుపాకీ గన్ మౌంట్ ర్యాంప్‌పై ట్రాక్షన్ కోల్పోయి వెనుక్కు జారింది. దాంతో జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఫీల్డ్ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు అప్పటికే చనిపోయినట్లుగా తెలిపారు.

# భూ కబ్జాదారులపై కఠిన చర్యలు

- హైడ్రా రాకముందు కట్టడాలను కూల్చబోము
- ఎఫ్‌టీఎల్‌లో అనుమతులులేని వాణిజ్య, వ్యాపార కట్టడాలు
- అలా కట్టిన కట్టడాలను మాత్రం కూల్చక తప్పదు
- లోటుపాట్లు ఉంటే సవరించుకుని నిబద్ధతో ముందుకు
- త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి
- మరోసారి హెచ్చరించిన హైడ్రా



**హైదరాబాద్, డిసెంబర్ 18((వెలుతురు):** పేదలను ముందు పెట్టి చక్రం తిప్పుతున్న భూకబ్జాదారులపై కఠిన చర్యలు తప్పని హైడ్రా మరోసారి హెచ్చరించింది. పాత్రదారులు, సూత్రదారులు ఎవ్వరైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. జులై తర్వాత అనుమతి లేకుండా నిర్మించే కట్టడాలనే హైడ్రా కూల్చి వేస్తుందనే ప్రకటనతో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో స్పందించిన రంగనాథ్ ఇప్పటి వరకు హైడ్రా కూల్చివేతలకు సంబంధించిన సమగ్ర వివరణ ఇస్తూ ఆయా వివరాలను వెల్లడించారు. హైడ్రా రాకముందు అనుమతి ఇచ్చిన ఏ కట్టడాలను కూల్చబోమని, ఎఫ్ టీఎల్‌లో అనుమతి లేకుండా కట్టిన ఎన్ కన్వెన్షన్ లాంటివాటిని కూల్చక తప్పదని రంగనాథ్ పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ స్థలాలు, పార్కుల పరిరక్షణతో పాటు చెరువుల పునరుద్ధరణకు కృషి చేస్తోన్న హైడ్రాపై విమర్శలు వెల్లువెత్తున్న వేళ కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా వెనక్కి తగ్గిదంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తూ హైడ్రా పనితీరుపై సమగ్ర వివరాలను వెల్లడించారు. హైడ్రా రాకముందు అనుమతి ఇచ్చిన ఏ కట్టడాలనూ కూల్చబోమని, అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు జూలై 2024కి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే కూల్చదని రంగనాథ్ స్పష్టం చేశారు. ఎఫ్టీఎల్‌లో అనుమతులు లేకుండా కట్టిన ఎన్ కన్వెషన్ లాంటి వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం కూల్చక తప్పదన్నారు. గతంలో అనుమతులు ఇచ్చి తరువాత రద్దు చేస్తే ఆ కట్టడాలు అక్రమకట్టడాలుగా పరిగణిస్తామని వివరించిన రంగనాథ్ అనుమతులు రద్దయినప్పటికీ నిర్మాణాలు జరుగుతున్న వాటిని కూడా అక్రమ కట్టడాలుగా పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుందన్నారు. మల్లంపేట కత్వా చెరువు, అమీర్‌పూర్‌లో కూల్చివేతలు అక్రమ కట్టడాల కిందకే వస్తాయన్నారు. పేదలను ముందుపెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న భూ కజ్జాదారులను ఉపేక్షించేది లేదని, చింతల్, గాజులరామారం, మాదాపూర్‌లోని సున్నం చెరువులో కూల్చివేతలను కబ్జాదారుల్లో ఉన్నవేనని తెలిపారు. గడిచిన 5 నెలల్లో 12 చెరువుల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 12 చెరువులలో పునరుద్ధరణకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే పనులు మొదలుపెట్టనున్నట్లు రంగనాథ్ వివరించారు. సున్నం చెరువులో కూల్చివేతల తర్వాత కూడా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మళ్లీ నిర్మాణాలు చేపట్టారని, వాటన్నింటిని కూల్చివేసి రాబోయే రోజుల్లో ఆ చెరువుకు ఎఫ్టీఎల్ నిర్ధారించి పునరుద్ధరణ చర్యలు చేపడతామని రంగనాథ్ వివరించారు. ప్రభుత్వ దిశానిర్దేశం మేరకే హైడ్రా పనిచేస్తుందని, వివిధ సందర్భాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పునకు లోబడి హైడ్రా ముందుకెళ్తుందన్నారు. అలాగే హైడ్రాను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పలు అధికారాలను కట్టబెట్టిందన్న ఆయన సాంకేతికంగా కూడా హైడ్రా మరింత బలంగా తయారవుతుందన్నారు. హైదరాబాద్‌లో చెరువుల ఎఫ్టీఎల్ మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే హైడ్రా మొదలు పెట్టిందన్నారు. ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు రంగనాథ్ వివరించారు. 5 నెలల అనుభవాల నుంచి హైడ్రా అనేక అంశాలపై స్పష్టమైన వైఖరితో ముందుకెళ్తోందన్నారు. లోటుపాట్లు ఏమైనా ఉంటే వాటిని సవరించుకొని మరింత నిబద్ధతతో హైడ్రా పనిచేస్తోందని రంగనాథ్ స్పష్టం చేశారు. అలాగే హైడ్రాకు వస్తున్న ఫిర్యాదులపై కూడా రంగనాథ్ స్పందించారు. కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు తమ ప్రాధాన్యత ఉంటుందన్న రంగనాథ్ ప్రజలు పెద్ద ఎత్తున హైడ్రాపై నమ్మకంతో ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 5 వేలకుపైగా ఫిర్యాదులను హైడ్రా పరిష్కరించిందన్నారు. పలు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటినింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకుంటామని రంగనాథ్ తెలిపారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రంగనాథ్ ప్రకటించారు. భూ కబ్జాల వెనక ఉన్న పాత్రదారులు, సూత్రదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పని రంగనాథ్ హెచ్చరించారు.

# ఫ్యూచర్ సిటీకి రవాణా సౌకర్యం కోసం కార్యాచరణ

## ఔటర్ తరహాలో 40 కిలోమీటర్ల మేర నిర్మాణం

## తొలి దశలో 458 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్

## భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, డిసెంబర్ 18((వెలుతురు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ( భావి నగరాని)కి రవాణా సౌకర్యాల కోసం అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఫ్యూచర్ సిటీకి చేరుకునేలా ఔటర్ తరహాలో 330 అడుగుల రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా రిజినల్ రింగ్‌రోడ్డు వరకు 40 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించడంతోపాటు వెయ్యి ఎకరాల ప్రైవేటు భూములను అధికారులు సేకరించనున్నారు. ఈ సందర్భగా తొలి దశలో 458 ఎకరాలు సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. కొంగంకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ మీదుగా ప్రాంతీయ రింగ్‌రోడ్డుకు నిర్మిస్తున్న రహదారి శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సులభంగా చేరుకునేలా



ఉంటుందని వివరిస్తున్నారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, రహదారులు, భవనాలశాఖ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. శంషాబాద్ - పెద్దఅంబర్‌పేట్ ఔటర్ ఎగ్జిట్ నంబర్ 13 వద్ద కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లోని ఫ్యూచర్ సిటీకి, అక్కడి నుంచి ఆమన్‌గల్ మండలం ఆకుతోటపల్లి వద్ద రీజనల్‌రింగ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ రోడ్డు అందుబాటులోకి రానుంది. దీనితోపాటు సర్వీస్‌రోడ్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు వికారాబాద్ జిల్లాలోని లగచర్లలో భూసేకరణపై జరిగిన రైతుల వ్యతిరేకత, దాడి ఘటనలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తులు, రైతుల నుంచి భూములు సేకరిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్, 2013 ప్రకారం అధికారులు రైతులకు పరిహారం ఇస్తున్నారు. ఇటీవలే రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా కొద్దిరోజులుగా కందుకూరు మండలంలోని గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. కొందరు రైతులను అధికారులు తమతోపాటు తీసుకెళ్తున్నారు. పోలీసులకు సమాచారమిచ్చి సర్వే పూర్తి అయ్యే వరకు ఉండాలి కోరుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ గురించి ప్రకటించిన తర్వాత మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, తుక్కుగూడ ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. దీంతో కొందరు రైతులు మార్కెట్ ధరలకే తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

## కనిష్ఠ స్థాయికి పడిపోతున్న పరిస్థితి

## మరో రెండు రోజులపాటు అధికంగా చలి తీవ్రత

**హైదరాబాద్, డిసెంబర్ 18 ((వెలుతురు):** తెలంగాణ రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదలవుతుంది. ఇక ఉదయం 10 గంటల దాకా చలి తగ్గకపోవడంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే గజగజ వణికిపోతున్నారు. ఉత్తరాది నుంచి వీస్తున్న చల్లటి గాలుల వల్ల రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు చలి తీవ్రత ఇదే మాదిరి ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మెదక్, సంగారెడ్డి, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోతాయని, ఈ జిల్లాల ప్రజలు మరింత అప్రమమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే అత్యల్పంగా హైదరాబాద్‌లో 6.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చాలా చోట్ల 7 డిగ్రీల మేర కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 7 డిగ్రీలు, మెదక్‌లో 7.5 చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఉపరితల ఈశాన్య దిశలో చలిగాలులు గంటకు 2 నుంచి 6 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో



కనిష్ఠ ఉష్ణోగ్రత 11.9 డిగ్రీల సెల్సియస్ నమోదు అయినట్లు వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 65 శాతంగా పేర్కొన్నారు. శీతలగాలుల నేపథ్యంలో ఇప్పటికే ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండురోజుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండే అవకాశం ఉందని, ఉదయం, సాయంత్రం వేళల్లో అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో అత్యల్పంగా 6.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఆ తర్వాత స్థానంలో నిర్మల్ జిల్లా తాండ్రలో 6.6, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 6.7, సంగారెడ్డి 6.8, కామారెడ్డి 7.6, నిజామాబాద్ 7.7, మెదక్ 8, జగిత్యాల 8, వికారాబాద్ 8.2, రాజన్నసిరిసిల్ల 8.6, సిద్దిపేట 8.6, రంగారెడ్డి 8.9, పెద్దపల్లిలో 9.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఇలా పలు జిల్లాల్లో 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక హైదరాబాద్ నగరంలోనూ పలు చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు నమోదవగా ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లిలో 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్‌ఈఎల్‌లో 7.4, గచ్చిబౌలి 9.3, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరేడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్‌లో 13.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో చలిగాలులు విజృంభిస్తున్నాయి. దీంతో గత ఆరేళ్లలో ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా నమోదవుతున్నాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు మరింత పడిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు.


# రాజ్యాంగ వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

## కలలో కూడా అంబేడ్కర్‌ను అవమానించని పార్టీ మాది

## కావాలనే వ్యాఖ్యలపై కాంగ్రెస్ దుష్ప్రచారం

## కేంద్ర హెూంమంత్రి అమిత్ షా స్పష్టత

**న్యూఢిల్లీ,డిసెంబర్ 18((వెలుతురు):** రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై తాను అనుచిత వ్యాఖ్యలు చేశానంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా . కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌కు, రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఎదురుదాడికి దిగారు. అంతేకాకుండా కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ విలువలను ఉల్లంఘించారని ఆరోపించారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్ గురించి తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించదని, ఆయనను ఎప్పటికీ, కనీసం కలలోనూ అవమానించనలేని పార్టీ నుంచి వచ్చినట్లు పేర్కొన్నారు. దిల్లీలోని బీజేపీ



కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈమేరకు స్పష్టత ఇచ్చారు.'కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. ఆయనకు భారతరత్న ఇవ్వలేదు. కేంద్రంలో బీజేపీ మద్దతు ఉన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరణానంతరం ఆయనకు భారతరత్న ఇచ్చింది. కాంగ్రెస్ ఏనాడూ అంబేడ్కర్ స్మారకాన్ని నిర్మించలేదు. బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్‌ను ఎంతో గౌరవించింది. ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టంగా ఉన్న నా ప్రసంగం రాజ్యసభ రికార్డుల్లో ఉంది. కలలో కూడా అంబేడ్కర్ ఆలోచలను అవమానించలేని పార్టీ, సిద్ధాంతం నుంచి వచ్చా. ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగ విలువలను ఉల్లఘించింది. ఆ వాస్తవాలన్నీ బయటకు రాగానే కాంగ్రెస్ తన పాత ట్రిక్కులను ఉపయోగించి వాస్తవాలను వక్రీకరిస్తుంది' అని అమిత్ షా మండిపడ్డారు.

# ఎన్‌హెచ్‌ఆర్‌సి నియామకం

## ప్రధానితో విపక్ష నేత రాహుల్ భేటీ

**న్యూఢిల్లీ,డిసెంబర్18(వెలుతురు):** జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ నియామకానికి కసరత్తు మొదలయ్యింది. ఈ క్రమంలో పార్లమెంట్ ప్రాంగణంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బుధవారం ప్రధానమంత్రి కార్యాలయంలో పీఎం మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భేటీ అయ్యారు.

జాతీయ మానవహక్కుల కమిషన్ నియామకం విషయమై ఈ భేటీ జరిగింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్‌ను ఎంపిక చేసే కమిటీలో పీఎం, కేంద్ర హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్, ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతలు సభ్యులుగా ఉంటారు. అయితే ప్రస్తుతానికి మోదీ, అమిత్‌షా, ఖర్గే, రాహుల్ మధ్యే సమావేశం జరిగింది. పలు కీలక అంశాల్లో ఇలా విపక్షాలతో కలసి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.



జబ్బుల మీద టీకాస్త్రం! ఒక్కసారి సంధిస్తే చాలు. చాలారకాల ఇన్‌ఫెక్షన్ జబ్బులు జీవితంలో మరెప్పుడూ మన దరిజేరవు. చుట్టుపక్కల వాళ్లకూ వ్యాపించవు. టీకాస్త్రాన్ని సరిగా ప్రయోగిస్తే మహమ్మారి జబ్బులనైనా సమూలంగా మట్టుపెట్టొచ్చు. ఒకప్పుడు ప్రపంచాన్ని గడగడలాడించిన మశూచి (స్మాల్‌పాక్స్) పూర్తిగా తుడిచిపెట్టుకుపోవటమే దీనికి నిదర్శనం. అంతెందుకు? పిల్లలను వైకల్యానికి గురిచేసి.. భవిష్యత్తుతో చెలగాటమాడుకునే పోలియోని ఇప్పుడు మనదేశం నుంచి పూర్తిగా నిర్మూలించగలిగామంటే అదంతా టీకా మహాత్మ్యమే. అయినా కూడా టీకాలపై ఇప్పటికీ ఎన్నెన్నో అనుమానాలు, భయాలు, అపోహలు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2 కోట్ల మంది పిల్లలు అసలు టీకాలకే నోచుకోవటం లేదు. ఒకవేళ తీసుకున్నా అరకొరగా మోతాదులతోనే నెట్టుకొస్తున్నారు. అందుకే ప్రపంచ టీకాల వారం 'టీకాలు కాపాడతాయి: పనిచేస్తాయి' అని నినదిస్తోంది. ఈ నేపథ్యంలో టీకాల ప్రాముఖ్యత, ఆవశ్యకతపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.

# టీకా.. భవిష్యత్తుకు భరోసా!



టీకా అంటే ఒక భరోసా. టీకా అంటే ఒక నమ్మకం. టీకా అంటే ఒక సంరక్షణ. జబ్బుల బారినపడకుండా కాపాడే మంచి తంత్రం, మంత్రం! జబ్బులు వచ్చాక బాధపడితే ఏం లాభం? అవి రాకుండా చూసుకోవటంలోనే ఉంది గొప్పతనం. ఇందుకు టీకానే ఉత్తమ మార్గం. జబ్బుల నివారణలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించటంలో టీకాలను మించిన మంచి కార్యక్రమం మరోటి లేదు. పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేలా చూడటం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఇది వ్యక్తిగతంగానే కాదు.. సమాజానికీ దేశానికీ మేలు చేస్తుంది. నేటి బాలలే రేపటి పౌరులు. అందుకే చిన్న పిల్లల వైద్య విభాగం కేవలం చికిత్సకే (క్యూరేటివ్) పరిమితం కావటం లేదు. జబ్బులు రాకుండా చూడటానికి (ప్రివెంటివ్), పిల్లలు మంచి ఆరోగ్యంతో ఎదగటానికి (ప్రమోటివ్) కూడా అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇలా అన్ని రకాలుగా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేలా చూడటంలో టీకాల పాత్ర చాలా కీలకం. క్షయ, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, గవదబిళ్లలు, రుబెల్లా, న్యుమోనియా, కామెర్లు, పోలియో, విరేచనాలు.. ఇలా పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేసే ఎన్నో రకాల జబ్బులకు టీకాలతో ఆదిలోనే ముకుతాడు వేయొచ్చు. పుట్టిన ప్రతి బిడ్డకూ టీకాలను పొందే అర్హత ఉందని, వాటిని ఇప్పించాల్సిన బాధ్యత పెద్దలదేనని తెలుసుకోవాలి. టీకా ఇస్తే బిడ్డ ఏడుస్తుందేమో, నొప్పి పుడుతుందేమో, జ్వరం వస్తుందేమో అని భయపడకుండా సార్వత్రిక టీకా కార్యక్రమంలో పేర్కొన్న అన్ని టీకాలను ఇప్పించాలి. ప్రభుత్వ కార్యక్రమంలో లేని మరికొన్ని టీకాలు ఇప్పించటమూ అవసరమే. కాబట్టి పిల్లలకు అవసరమైన టీకాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.

## టీకాలు ఎందుకు?

మన చుట్టూ బోలెడన్ని బ్యాక్టీరియా, వైరస్‌లు తిరుగాడుతుంటాయి. ఇవి శరీరం మీద దాడి చేసినపుడు రకరకాల జబ్బులు (ఇన్‌ఫెక్షన్లు) తలెత్తుతుంటాయి. నిజానికి హానికారక సూక్ష్మక్రిముల నుంచి మన రోగనిరోధక వ్యవస్థ నిరంతం కాపాడుతూనే ఉంటుంది. అయితే కొన్నిసార్లు సూక్ష్మక్రిములు రోగనిరోధక వ్యవస్థను అధిగమించి తమ ప్రతాపాన్ని చూపొచ్చు. ఇది జబ్బులకు దారితీస్తుంది. దీనికి ప్రధాన కారణం హానికారక సూక్ష్మక్రిములను మన రోగనిరోధక వ్యవస్థ గుర్తించలేకపోవటం. మరి సూక్ష్మక్రిములను రోగనిరోధక వ్యవస్థ గుర్తించగలిగిలా చేయగలిగితే? సరిగ్గా టీకాలు చేసే పని ఇదే. హానికారక సూక్ష్మక్రిములు ఏవి? వాటిని ఎదుర్కోవటం, నిర్మూలించటం ఎట్లా? అనేవి రోగనిరోధక వ్యవస్థ గుర్తించటానికి టీకాలు తోడ్పడతాయి. ఇలా జబ్బుల బారినపడకుండా కాపాడతాయి.

## ప్రధానంగా 3 రకాలు

నిజానికి టీకాల్లో ఉండేవి కూడా సూక్ష్మక్రిములే. కాకపోతే ఇవేవీ మనకు హాని చేయవు. సూక్ష్మక్రిములను నిర్వీర్యం చేసో.. చంపేసో లేదంటే వాటి భాగాలతోనో టీకాలను తయారుచేస్తారు. జీవించి ఉన్న సూక్ష్మక్రిములతో కూడినవి సజీవ (లైవ్) టీకాలు. సూక్ష్మక్రిములను నిర్వీర్యం చేసి వీటిని రూపొందిస్తారు. అందువల్ల ఇవి ఒంట్లోకి చేరినా వృద్ధి చెందవు, వ్యాపించవు. కానీ మన రోగనిరోధక వ్యవస్థ ఈ సూక్ష్మక్రిములను పసిగట్టి.. వాటిని ఎదుర్కోవటానికి అవసరమైన యాంటీబాడీలను తయారుచేసుకొని పెట్టుకుంటుంది. చనిపోయిన సూక్ష్మక్రిములతో తయారుచేసేవి విగత (కిల్డ్) టీకాలు. ఇక సూక్ష్మక్రిముల భాగాలతో రూపొందించినవి ఆంశిక (కాంపోనెంట్) టీకాలు. వీటిల్లోని సూక్ష్మక్రిముల భాగాలను, ప్రోటీన్ల వంటి వాటిని శరీరం పసిగట్టి యాంటీబాడీలను తయారుచేసుకుంటుంది. ఇవి మన శరీరంలో జీవితాంతం ఉంటాయి. మున్ముందు మళ్లీ ఎప్పుడైనా అవే సూక్ష్మక్రిములు దాడిచేస్తే ఇవి పెద్దఎత్తున ఉత్పత్తయ్యి సూక్ష్మక్రిముల పని పడతాయి. మన రోగనిరోధక వ్యవస్థలో టి కణాలు, బి కణాలు ఉంటాయి. టి కణాలను జ్ఞాపక కణాలని అనుకోవచ్చు. ఇవి ఆయా సూక్ష్మక్రిములను ఎప్పటికీ మరచిపోవు. అలాంటి క్రిములు ఒంట్లో ఎప్పుడు ప్రవేశించినా వెంటనే గుర్తుపట్టి యాంటీబాడీల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఇక బి కణాలేమో అవసరమైనపుడు యాంటీబాడీలను తయారుచేస్తాయి.

### జాగ్రత్తలు తప్పనిసరి

* నాణ్యమైన టీకాలు ఇప్పిస్తున్నామా లేదా అనేది చూసుకోవాలి. టీకాలు చెడిపోకుండా వాటిని చల్లటి పెట్టెలో భద్రపరచటం చాలా కీలకం. ఏమాత్రం ఎండ తగిలినా టీకా నిర్వీర్యమైపోతుంది. ఇచ్చినా పనిచేయదు.
* చల్లటి పెట్టెలోంచి లేదా ఫ్రిజ్‌లోంచి తీశాక వెంటనే టీకాను ఇచ్చేలా చూసుకోవాలి. కొన్ని టీకాలు పొడి రూపంలో ఉంటాయి. వీటికి డిస్టిల్డ్ నీళ్లు కలిపి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి టీకాలను ఎప్పటికప్పుడే ఇచ్చేయాలి. మిగిలిపోతే మర్నాడు ఇవ్వటం తగదు. ఇద్దరు ముగ్గురికి ఇవ్వాల్సినపుడు ఒకటే మోతాదు గల సీసాను వాడుకోవటం మంచిది.
* ఏ టీకా తీసుకున్నా అరగంట వరకు ఆసుపత్రిలోనే ఉండాలి. ఏవైనా దుష్ప్రభావాలు తలెత్తితే వెంటనే జాగ్రత్త పడటానికి వీలుంటుంది. ఆసుపత్రుల్లో కూడా దుష్ప్రభావాలు తలెత్తినపుడు అత్యవసరంగా చికిత్స చేయటానికి అవసరమైన సదుపాయాలన్నీ ఉండాలి.
* టీకాల పట్టీలో టీకా ఇచ్చిన తేదీతో పాటు టీకా బ్యాచ్ సంఖ్య, తయారైన తేదీ కూడా నమోదు చేయాలి. ఏవైనా దుష్ప్రభావాలు తలెత్తితే ఆ టీకా ఎక్కడెక్కడ ఉన్నది, ఎవరికి ఇచ్చారనేది వెంటనే తెలిసిపోతుంది.

## సురక్షితకే తొలి ప్రాధాన్యం!

టీకాల విషయంలో ఎప్పుడైనా సురక్షితకే తొలి ప్రాధాన్యం. మంచి ఆరోగ్యంతో ఉన్న పిల్లలకు టీకా ఇస్తున్నామంటే దాంతో ఎలాంటి హాని కలగకుండా ఉండటం ముఖ్యం. అందుకే టీకాలను రూపొందించినపుడు ముందుగా జంతువుల మీద ప్రయోగించి అవి సురక్షితమా? కాదా? ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి? అనేది తెలుసుకుంటారు. అనంతరం మనుషుల మీద ప్రయోగించి చూస్తారు. అవి సురక్షితంగా, బాగా పనిచేస్తున్నాయని తేలితేనే పిల్లలకు ఇచ్చి పరీక్షిస్తారు. ఇలా నాలుగైదు ప్రయోగ పరీక్షలు చేసి.. అన్నింట్లోనూ మంచి ఫలితం కనబడితే ఎక్కువమంది పిల్లలకు ఇచ్చి చూస్తారు. అప్పుడు కూడా ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా పని చేస్తున్నట్టు తేలితేనే అందరికీ ఇవ్వటానికి అనుమతిస్తారు.

## చులకనగా చూడొద్దు!

ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందనో, చవకగా దొరుకుతున్నాయనో టీకాలను చులకగా చూడొద్దు. ఇవి శాస్త్రవేత్తలు ఎంతో సమయం వెచ్చించి, నిబద్ధతతో శ్రమించి మానవాళికి అందించిన గొప్ప వరాలు. వీటి తయారీ పెద్ద యజ్ఞం లాంటిది. ఒక టీకా రూపకల్పన దగ్గర్నుంచి ప్రయోగ పరీక్షలన్నీ దాటుకొని అందరికీ అందుబాటులోకి రావటానికి కనీసం 1015 సంవత్సరాలు పడుతుంది. అదీ ఇరవై టీకాల మీద ప్రయోగాలు చేస్తే ఒకటో రెండో విజయవంతమవుతాయి. టీకాల పరిశోధన, రూపకల్పనకు ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. కాబట్టి టీకాలను తేలికగా తీసుకోవటానికి వీల్లేదు.

## టీకా మరచిపోతే..

ఎప్పుడైనా టీకా వేయించటం మరచిపోతే ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఇప్పించాలి. అయితే ఒక మోతాదుకు మరో మోతాదుకు మధ్యలో కనీసం నెల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు ఆరోవారం వేయించాల్సిన టీకా మరచిపోయారు. పదో వారం దగ్గర పడింది. అప్పుడు ఆరోవారం వేయించాల్సిన టీకాను ఇప్పించి.. నెల తర్వాత పదోవారం మోతాదు ఇప్పించాలి.

## బూస్టర్ టీకా ఎందుకు?

టీకాలు ఇప్పించాం కదా. మళ్లీ బూస్టర్ టీకాలు ఎందుకని కొందరు భావిస్తుంటారు. ఇది తప్పు. కొన్ని టీకాల ప్రతిస్పందన కొన్నిరోజులకు నిద్రావస్థలోకి వెళ్లిపోతుంటుంది. బూస్టర్ టీకా ఇవ్వగానే యాంటీబాడీలు తిరిగి పుంజుకుంటాయి. అంటే టీకాల ప్రభావం తగ్గకుండా ఉంటుందన్నమాట. ఒకసారి టీకా ఇచ్చినపుడు కొన్ని యాంటీబాడీలు తయారవుతాయి. రెండోసారి ఇస్తే అవి మరింత ఎక్కువగా పుట్టుకొస్తాయి. మూడోసారి ఇస్తే ఇంకాస్త ఎక్కువగా పుట్టుకొస్తాయి. టీకా మోతాదు అంతే అయినా ప్రతిస్పందన తీరు మరింత ఉధృతంగా ఉంటుంది. కాబట్టి కొన్ని టీకాలకు బూస్టర్ అవసరమని గుర్తించాలి.

## పెద్దలకు కూడా..

టీకాలనగానే ముందు చిన్న పిల్లలు గుర్తుకొచ్చే మాట నిజమే గానీ పెద్దలకు ముఖ్యంగా వృద్ధులకు కూడా కొన్ని టీకాలు అవసరం. అరవై ఏళ్లు దాటిన అందరూ ఫ్లూ టీకా తీసుకోవాలి. దీన్ని ఏటా తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే న్యుమోనియా రాకుండా న్యుమోకోకల్ టీకా తీసుకోవాలి. దీన్ని ఒక మోతాదు తీసుకుంటే సరిపోతుంది.

## ప్రత్యేక పరిస్థితుల్లో..

జాతరలు, మేళాలు, కుంభమేళాల వంటి ప్రత్యేక పరిస్థితుల్లో కలరా వచ్చే అవకాశముంది. అందువల్ల అక్కడికి వెళ్లిన అందరూ కలరా టీకా తీసుకోవాల్సి ఉంటుంది. కుక్క కరచినపుడు రేబిస్ టీకా అవసరపడుతుంది. దీన్ని ఇచ్చిన తర్వాత వారం, పది రోజులకు గానీ యాంటీబాడీలు ఉత్పత్తి కావు. కాబట్టి రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్లు కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

## తల్లిపాలే తొలి టీకా


నిజానికి పిల్లలకు తొలి టీకా తల్లిపాలే. తొలిసారిగా వచ్చే ముర్రుపాలలో యాంటీబాడీలు, రోగనిరోధక వ్యవస్థ ప్రేరేపకాలు సంసిద్ధంగా ఉంటాయి. కాబట్టి మాములు కాన్పయినా, సిజేరియన్ అయినా బిడ్డ పుట్టిన గంటలోపు.. వీలైనంత త్వరగా తల్లిపాలు పట్టటం తప్పనిసరి. తల్లిపాలు ఇవ్వకపోతే తొలి టీకా ఇవ్వనట్టే!

## క్రమం తప్పకుండా..

పిల్లలకు సార్వత్రిక టీకా కార్యక్రమంలో చాలావరకు టీకాలు ఇస్తున్నారు. ఇందులో లేని మరికొన్ని టీకాలు కూడా పిల్లలకు అవసరమేనని పిల్లల వైద్య సమాఖ్య సిఫారసు చేస్తోంది.

### తొలిరోజున..

* ఎడమ చేయికి బీసీజీ టీకా ఇవ్వాలి. ఇది క్షయ బారినపడకుండా కాపాడుతుంది. అలాగే పోలియో టీకా చుక్కలు వేస్తారు. దీన్ని 'జీరో డోస్' అంటారు. ఇది మిగతా పోలియో మోతాదులకు అదనం. వీటితో పాటు హెపటైటిస్ బి టీకా ఇవ్వాలి. దీన్ని తొడకు వెలుపలి వైపున ఇవ్వటం మంచిది. ఎందుకంటే పుట్టినపుడు పిల్లలకు కండరం ఇక్కడే ఎక్కువగా ఉంటుంది.



### 6వ వారాల తర్వాత..

* ఆరో వారం తర్వాత పోలియో చుక్కలతో పాటు కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం నుంచి రక్షించే డీపీటీ టీకా కూడా ఇవ్వాలి. అలాగే చెవి ముక్కు గొంతు ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా, మెదడు వాపు రాకుండా చూసే హిమోఫిలస్ ఇన్‌ఫ్లుయెంజా బి (హిబ్) టీకా.. కామెర్ల నుంచి కాపాడే హెపటైటిస్ బి టీకా కూడా ఇవ్వాలి. ఇప్పుడు డీపీటీ, హిబ్, హెపటైటిస్ బి టీకాలన్నీ ఒక్క టీకా రూపంలోనే (పెంటావాలెంట్) అందుబాటులో ఉంది. ఈ ఒక్కటి ఇప్పిస్తే ఐదు జబ్బుల నుంచీ రక్షణ లభిస్తుంది.
* పోలియో చుక్కలతో పాటు ఇటీవలి కాలంలో పోలియో సూది టీకా (ఇంజెక్టబుల్ పోలియో వ్యాక్సిన్ ఐపీవీ) కూడా ఇస్తున్నారు. ఇతర దేశాల్లో ఐపీవీనే ఇస్తుంటారు. మనదేశంలోనూ నెమ్మదిగా చుక్కల మందును తీసేసి సూది టీకాను ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలియో చుక్కలతో పాటు సూది టీకానూ ఇస్తున్నారు. కొన్నాళ్లు పోయాక ఒక్క పోలియో సూది టీకానే ఇవ్వచ్చు.

### 10, 14 వారాల తర్వాత..

* 10వ వారం అలాగే 14వ వారం తర్వాత పెంటావాలెంట్ టీకాను ఇవ్వాలి. దీంతో మొత్తం మూడు మోతాదులు పూర్తవుతాయి. అలాగే పోలియో చుక్కలు, పోలియో సూది టీకా కూడా ఇవ్వాలి. ఇవి కాకుండా న్యుమోనియా బారినపడకుండా చూసే పీసీవీ టీకా, విరేచనాల నుంచి రక్షించే రోటా టీకా కూడా అవసరమే. దాదాపు 141 దేశాలు తమ జాతీయ టీకా కార్యక్రమంలో వీటిని ఇస్తున్నాయి. మనదేశంలోనూ సార్వత్రిక టీకా కార్యక్రమంలో కొన్ని రాష్ట్రాల్లో వీటిని ఇస్తున్నారు. త్వరలోనే వీటిని అన్ని రాష్ట్రాలకూ విస్తరించనున్నారు.

### 6వ నెలలో..

* ఫ్లూ టీకా ఇవ్వాలి. (ప్రభుత్వ టీకా కార్యక్రమంలో లేకపోయినప్పటికీ దీన్ని 6వ నెలలో ఆరంభించి.. నెల తర్వాత మరో మోతాదు ఇప్పించాలి. ఆ తర్వాత ప్రతి ఏటా ఒక మోతాదు తప్పకుండా ఇప్పించాలి)

### 9 నెలల తర్వాత..

* గతంలో తట్టు, తడపర నుంచి కాపాడే మీజిల్స్ టీకా మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు దీనికి రుబెల్లా (జర్మన్ మీజిల్స్) టీకాను కూడా కలిపి 'ఎంఆర్' టీకా ఇస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో దీనికి బదులు గవద బిళ్లల నుంచి కాపాడే మమ్స్ టీకాతో కూడిన ఎంఎంఆర్ టీకా ఇస్తున్నారు. దీంతో పాటు టైఫాయిడ్ టీకా కూడా ఇప్పించాలి. అలాగే మెదడువాపు ఎక్కువగా కనబడే జిల్లాల్లో 'జపనీస్ ఎన్‌కెఫలైటిస్ (జెబి) బి టీకా' కూడా ఇప్పించటం అవసరం.

### 12 నెలల తర్వాత..

* హెపటైటిస్ ఎతో పాటు ఆటలమ్మ నుంచి రక్షించే వారిసెల్లా టీకా ఇప్పించాలి.

### 15 నెలల తర్వాత..

* పీసీవీ బూస్టర్, ఎంఎంఆర్ ఇప్పించాలి.

### 16–18 నెలల్లో..

* పోలియో, డీపీటీ, హిబ్ బూస్టర్ టీకాలు.. అలాగే హెపటైటిస్ ఎ రెండో మోతాదు కూడా ఇప్పించాలి.

### 4–6 ఏళ్లలో..

* డీపీటీ బూస్టర్, వారిసెల్లా రెండో మోతాదు, ఎంఎంఆర్ టీకా ఇప్పించాలి.

### 9 ఏళ్లు దాటాక..

* టీడ్యాప్ టీకా ఇవ్వాలి. అలాగే అదనంగా బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారినపడకుండా చూసే హెచ్‌పీవీ టీకా ఇప్పించాలి. దీన్ని మొత్తం మూడు మోతాదులు (మొదటి టీకా తీసుకున్నాక 2 నెలలకు, 6 నెలలకు) ఇప్పించాలి. క్యాన్సర్ నుంచి తప్పించే టీకా ఇదొక్కటే కావటం గమనార్హం. అయితే దీన్ని 11 ఏళ్ల లోపే తీసుకుంటే రెండు మోతాదులే సరిపోతాయి. అదే 12 ఏళ్లు దాటితే మూడు మోతాదులూ తీసుకోవాలి.

### అపోహలు వద్దు!

* టీకా తీసుకోవటం తప్పనిసరి కాదన్నది కొందరి అపోహ. ఇష్టముంటే తీసుకోవచ్చు, లేకపోతే లేదు అని భావిస్తుంటారు. ఇది సరికాదు. టీకాలు తీసుకోవటం పిల్లల హక్కు. ఇచ్చే బాధ్యత మనది. వాళ్ల హక్కు లను పరిరక్షించాలి. బాధ్యతాయుతంగా ఇప్పించాలి.
* టీకాలతో ఆటిజమ్, మెదడు దెబ్బతినటం, సంతానలేమి వంటివి తలెత్తుతాయన్నది మరి కొందరి అపోహ. ఇందులో నిజం లేదు. టీకాలు సురక్షితమని గుర్తించాలి.
* టీకా ఇవ్వటం వల్ల సహజ రక్షణ వ్యవస్థ క్షీణిస్తుందని మరికొందరు అనుకుంటుంటారు. ఇది తప్పు. యాంటీ వ్యాక్సిన్ లాబీలు చేసే ప్రచారాలు నమ్మొద్దు. వాటిని వ్యాపింపజేయొద్దు. టీకాలతో సహజ రక్షణ వ్యవస్థను ప్రేరేపిస్తున్నామే గానీ అణచి వేయటం లేదని తెలుసుకోవాలి.
* టీకా ఇచ్చినపుడు కొందరికి నొప్పి, జ్వరం వంటి చిన్నా చితకా ఇబ్బందులు ఉంటే ఉండొచ్చు. ఇవి తాత్కాలికం. టీకాలతో ఒనగూడే ప్రయోజనాలతో పోలిస్తే ఇవి ఒక లెక్కలోకే రావు. అందువల్ల వీటిని పెద్దగా పట్టించుకోవద్దు.

# ఎముకకు ఆటల బలం!

యుక్తవయసులో శరీరం, ఎముకల ఎదుగుదల చురుకుగా, వేగంగా సాగుతుంది. ఒకవేళ దీనికి ఏదైనా అవాంతరం తలెత్తితే మున్ముందు జీవితాంతం ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఎముక సాంద్రత తగ్గిపోయి.. ఎముకలు క్షీణించటం, తేలికగా విరిగిపోవటం వంటి ముప్పులు పెరుగుతాయి. అందువల్ల యుక్తవయసులో తగినంత శారీరకశ్రమ, వ్యాయామం చేసేలా పిల్లలను ప్రోత్సహించటం ఎంతో మంచిది. ఇవి కుదరకపోతే కనీసం ఆరుబయట ఆటలు ఆడేలా చూసినా మేలే. దీంతో ఎముకల్లోకి క్యాల్షియం బాగా చేరుకుని, ఎముక పుష్టికి తోడ్పడుతుంది. తాజా అధ్యయనం ఒకటి దీన్ని మరోసారి బలపరిచింది. ఫుట్‌బాల్ ఆడటం వల్ల యుక్తవయసు మగపిల్లల్లో ఎముకల వృద్ధి మెరుగ్గా ఉంటున్నట్టు బ్రిటన్‌లోని ఎక్స్‌టర్ విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. ఈత కొట్టటం, సైకిల్ తొక్కటం వంటి వాటి కంటే కూడా ఫుట్‌బాల్‌తోనే మరింత మెరుగైన ఫలితం కనబడుతుండటం విశేషం. అధ్యయనంలో భాగంగా 12 14 ఏళ్ల భావి క్రీడాకారులను ఎంచుకొని ఏడాది పాటు పరిశీలించారు. ఈత, సైకిల్ క్రీడాకారులతో పోలిస్తే వీరిలో ఎముకలోని ఖనిజాల మోతాదు (బీఎంసీ) మరింత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. వారానికి 9 గంటల సేపు ఫుట్‌బాల్ సాధన చేసేవారినే తాము పరిశీలించినప్పటికీ.. వారానికి 3 గంటల సేపు ఫుట్‌బాల్ ఆడినా గణనీయమైన ఫలితం కనబడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. తీవ్రమైన శారీరకశ్రమను కలగజేస్తూ, కండరాలపై బాగా ప్రభావం చూపే టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి క్రీడలు కూడా ఇలాంటి ప్రభావమే చూపగలవని పేర్కొంటున్నారు. కాబట్టి వీలైనప్పుడల్లా పిల్లలను ఆటలు ఆడేలా ప్రోత్సహించటం మంచిది. ఇవి భవిష్యత్తు ఆరోగ్యానికి సోపానాలుగా పనిచేస్తాయి. పెద్దయ్యాక మరింత బలంగా, దృఢంగా ఉండేందుకు కూడా తోడ్పడతాయి.



# శీతల పానీయాలతో సంతానలేమి!

శరీర పోషణకోసం అంటూ మనం తీసుకునే ఆహార పానీయాల్లో కొన్ని నేడు మన ఆరోగ్యాన్నే దెబ్బ తీసే పరిస్థితులు తయారవుతున్నాయి. ఒక దశలో పునరుత్పత్తి వ్యవస్థనే నిర్జీవంగా మార్చేస్తున్నాయి. ప్రత్యేకించి సోడాలు, ఇతర శీతల పానీయాలు (సాఫ్ట్ డ్రింక్స్) కొన్ని సేవించడం వల్ల స్త్రీ పురుషులు ఇరువుల్లోనూ సంతాన లేమి సమస్యలు తలెత్తుతున్నాయి. గమనిస్తే, దాదాపు అన్నిరకాల శీతల పానీయాల్లోనూ కృత్రిమ తీపిని కలిగించే ఆస్పరేటమ్ అనే పదార్థం కనపడుతుంది. ఇది ఎండోక్రైన్ గ్రంథుల మీద దుష్ప్రభావాన్ని చూపుతుంది. ఫలితంగా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి, ఇది కూడా సంతానోత్పత్తి సమస్యలకు కారణమవుతుంది. సోడాలు, శీతలపానీయాలను అతిగా సేవించే స్త్రీలలో అండాశయ సమస్యలు ఏర్పడటంతో పాటు పీ.ఎమ్. ఎస్ (ప్రీ మెన్‌స్టురల్ సింటమ్స్) లో హెచ్చు తగ్గులు ఏర్పడతాయి. ఈ ఆస్పరేటమ్ వల్ల సంతానోత్పత్తి సమస్యలతో పాటు గర్భస్రావాలు, గర్భస్థ శిశు వైకల్యాలు ఏర్పడే ప్రమాదం కూడా ఉంది.



ఆస్పరేటమ్‌లో సహజంగానే ఫినైలలానిన్, ఆస్పెర్టిక్ యాసిడ్ అనే రెండు ఆమ్లాలు కూడా ఉంటాయి. వీటిని ఇతర అమైనో ఆమ్లాలతో కలిపి సేవిస్తే హానికరమేమీ కాదు. అలా మరి వేటితోనూ కలపకుండా విడిగా సేవిస్తే, శరీర కణాలు చనిపోయే అవకాశం ఉంది. మరీ ఎక్కువగా సేవిస్తే, పురుషుల వీర్యకణాలు, స్త్రీల అండకణాలు దాదాపు 90 శాతం దాకా నశించే ప్రమాదం ఉంది.

ఎక్కువ తీయగా ఉండే ఇలాంటి పానీయాలు ఏవి తాగినా, వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. సంతానోత్పత్తికి అతి ముఖ్యమైన అంశాలు శరీరంలో తగ్గిపోతాయి. హార్మోన్ల అసమతుల్యతతో పాటు ఊబకాయం వచ్చేస్తుంది.

శీతల పానీయాలు ఎక్కువగా తాగే పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, జీవత్వం, వాటి చలనశక్తి తగ్గే అవకాశం ఉంది. సోడాల్లో ఆమ్లాలు మరీ ఎక్కువ గా ఉంటాయి. వీటి వల్ల పీ.హెచ్. శాతం మారిపోతూ ఉంటుంది. పీ.హెచ్ ఎక్కువైతే, పోషకాలు నిలవవు. దీని వల్ల వీర్యకణాల ఆకారం మారడం, నాణ్యత లోపించడం, లేదా వీర్యకణాలు చనిపోవడం జరగవచ్చు. వీటిల్లో ఉండే బిస్ ఫినాల్‌ఎ (బిపిఎ) అనే రసాయనం వల్ల పురుషుల వీర్యధ్రవం, నాణ్యత క్షీణిస్తాయి.



# రాజాసాబ్ షూటింగ్ పూర్తి

గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న చిత్రం రాజాసాబ్. మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారని తెలిసిందే. సినిమా షూటింగ్‌కు సంబంధించి అభిమానుల్లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు మారుతి.

ఈ డైరెక్టర్ బచ్చలమల్లి ప్రమోషనల్ ఈవెంట్‌లో రాజాసాబ్ షూటింగ్ పూర్తయిందని క్లారిటీ ఇచ్చేశాడు. అయితే రాజాసాబ్ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌ను నిరాశ చెందేలా చేస్తుంది. రాజాసాబ్ విడుదల వాయిదా పడిందని వార్తలు వస్తుండగా.. మరోవైపు మీరు ఏ డేట్‌కు చూడాలనుకుంటే బాగుంటదో అదే తేదీన రాజాసాబ్ వస్తుందని మారుతి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరి రాజాసాబ్ విడుదలపై మేకర్స్ నుంచి అధికారికంగా ఏదైనా ప్రకటన వస్తుందేమో చూడాలి. అంతేకాదు రాజాసాబ్ టీజర్ రన్‌టైం 2 నిమిషాల 15 సెకన్లు అని ఇన్‌సైడ్ టాక్. రాజాసాబ్ మోషన్ పోస్టర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రంలో మలబారు సోయగం మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ కీ రోల్ పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.




# జాక్‌తో ముందుకు వస్తున్న జొన్నలగడ్డ

టాలీవుడ్ యాక్టర్ సిద్దు జొన్నలగడ్డ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి జాక్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ 37గా వస్తోంది. మేకర్స్ తాజాగా విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు. ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్‌ను 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించగా.. రిలీజ్ వాయిదా పడుతుందంటూ వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాక్ సినిమాను ఇదే తేదీన విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు.

తాజా లుక్‌లో నిర్మానుష్య ప్రదేశంలో ఓ వైపు జీపు కనిపిస్తుండగా.. మరోవైపు గన్‌ను చూడొచ్చు. రాజాసాబ్ తేదీన వస్తుండటంతో సూపర్ బజ్ క్రియేట్ అవడం పక్కా అని అర్థమవుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్‌ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సిద్దు జొన్నల గడ్డ దీంతోపాటు నీరజ కోన డైరెక్షన్‌లో తెలుసు కదా సినిమా చేస్తుండగా.. మరోవైపు టిల్లు 3 కూడా లైన్‌లో ఉంది.






# ఆ టైం కెరీయర్ అయిపోయిందనుకున్నా : మహీరాఖాన్

షారుక్‌ఖాన్‌తో నటించిన రయీస్‌తో ఇండియాలో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది పాకిస్థానీ నటి మహీరాఖాన్. సోషల్‌మీడియాలో ఈ భామకున్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే ఈ బ్యూటీ బాలీవుడ్ స్టార్ యాక్టర్ రణ్‌బీర్‌కపూర్‌తో కలిసి సిగరెట్ పట్టుకుని దిగిన ఫొటోలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయని తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పర్సనల్‌గా, ప్రొఫెషనల్‌గా ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారనే విషయంపై మాట్లాడింది.

ది లిటిల్ వైట్ డ్రెస్ అంటూ ఓ జాతీయ మీడియాలో తనపై రాసిన కథనం గురించి చెబుతూ.. అప్పుడేం జరుగుతుందో అంతగా గుర్తించలేకపోయానంది. పాక్‌లో మంచి నటిగా పాపులర్ అయిన ఈ నటికి ఏమైందంటూ వచ్చిన వార్తలను చూసి తనకేమైనా పిచ్చి లేసిందా..? అని అనుకున్నానని చెప్పింది. దీంతో ఇక తన కెరీర్ క్లోజ్ అయిపోయిందనిపించిందన్న మహీరాఖాన్.. తన లైఫ్‌లో అవే కష్టతరమైన రోజులని చెప్పింది. ఓ వైపు విడాకుల బాధలో ఉంటే.. మరోవైపు పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌పై ఎఫెక్ట్ పడిందని.. ఈ విషయంలో తాను చాలా సార్లు ఏడ్చిన సందర్భాలున్నాయని చెప్పుకొచ్చింది. తాను సింగిల్ పేరెంట్‌గా ఉన్న టైంలోనే ఈ ఫొటోలు లీక్ అయ్యాయని.. కానీ కష్టకాలంలో తన అభిమానులు మద్దతుగా నిలిచారంది మహీరాఖాన్. ఇప్పుడీ ఎమోషనల్ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## ఒజీలో డీజే టిల్లు

# భామ నేహాశెట్టి

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ లవర్స్ అండ్ ఫ్యాన్స్. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## వరుస సినిమాలతో

# అజిత్‌కుమార్ బిజీ

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మగిజ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న విదాముయార్చి. ఏకే 62గా వస్తోన్న ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 2025 జనవరిలో పొంగల్ కానుకంగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. మేకర్స్ నుంచి విడుదల తేదీపై క్లారిటీ రావాల్సి ఉంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త స్టిల్స్ రూపంలో బయటకు వచ్చింది. విదాముయార్చి షూటింగ్ చివరి దశలో ఉంది. అజిత్ కుమార్ స్టైలిష్ సూట్‌లో ఉండగా.. త్రిష చీరకట్టులో స్టైలిష్ గాగుల్స్ పెట్టుకొని మెస్మరైజ్ చేస్తోంది. ఈ క్రేజీ స్టార్లు అందమైన లొకేషన్‌లో చిరునవ్వులు చిందిస్తూ నడుచుకుంటూ వస్తున్న స్టిల్‌తో పాటు లొకేషన్‌లో దిగిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఈ షూట్ లొకేషన్ ఎక్కడనేది తెలియాల్సి ఉంది.



లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీలో యాక్షన్ కింగ్ అర్జున్ సార్జా కీలక పాత్ర పోషిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. విదాముయార్చి పోస్టర్లు ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో ఆరవ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. అజిత్ కుమార్ మరోవైపు అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్‌లో ఏకే 63ను కూడా చేస్తుండగా.. గుడ్ బ్యాడ్ అగ్లీ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది.

# నాగచైతన్య, సాయిపల్లవి శివతాండవం



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్. చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా తండేల్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. శివశక్తి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 22న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చైతూ, సాయిపల్లవి శివతాండవం చూపించబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోంది తండేల్. ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య–చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com